నేటి కందం- నేటికి అందం



తీయని కబురుగ-సీమకు
శ్రేయమ్ముల నిడు"కిసాను"క్షేమమ్మునకై
పీ యం నిధులను విడుదల
చేయుట వినిపించ-జాతి చెందెను ముదమున్ !!

(రైతులకు పీ యం కిసాన్ నిధులు విడుదల అనే తీపి కబురు వినిపించింది)

-రాధశ్రీ
సెల్:9494481210




# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com


చురక

నినాదాల వెనుక ఎన్నో
నిత్యకృత్య స్వలాభాలు
ఎవరివైనా వాటి నిండా
ఎన్నెన్నో ప్రలోభాలు.
మాటలతో నమ్మించే
మంత్రఘనులే అందరు
భ్రమలోపడితే జనమంతా
లవుతూనే ఉందురు

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శుక్రవారం 1-8-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:263 పేజీలు:6 వెల: రూ.1/-

## పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

### -పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు ఆదేశం

న్యూఢిల్లీ జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ శాసన సభ స్పీకర్‌ను ఆదేశించింది. తీర్పు వచ్చిన తర్వాత మూడు నెలలకు మించకుండా నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించిన దేశ అత్యున్నత న్యాయస్థానం ఏండ్ల తరబడి ఫిరాయింపు పిటిషన్లు పెండింగ్‌లో ఉంచడం సరికాదని తెలిపింది. న్యాయస్థానమే అనర్హత వేటు వేయాలన్న విజ్ఞప్తిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని అత్యున్నత ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ వ్యవహారంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. పార్టీ మారుతున్న ఎమ్మెల్యేల పట్ల పార్లమెంటే చట్టం తీసుకురావాలని అభిప్రాయపడింది. 2023 నవంబర్‌లో తెలంగాణ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో కారు గుర్తుపై గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు.. ఆ తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కండువా కప్పుకొన్న దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అరికపూడి గాంధీ, కాలె యాదయ్య, బండ్ల క్రిష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, ప్రకాశ్‌గౌడ్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు కేపీ వివేకానందగౌడ్, పాడి కౌశిక్‌రెడ్డి వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌తోపాటు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వేసిన రిట్ పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల అంశానికి సంబంధించి స్పీకర్‌కు కోర్టులు సూచనలు చేయడం, చర్యలు తీసుకోవడానికి నిర్దేశిత కాలపరిమితి విధించే అంశంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చా అన్న అంశంపై సుప్రీంకోర్టు.. తెలంగాణ ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తరపున న్యాయవాదుల వాదనలను విన్నది. మూడు రోజులపాటు వరుసగా దీనిపై వాదనలు నడిచాయి. తుది తీర్పును రిజర్వు చేస్తున్నట్టు సుప్రీంకోర్టు ఏప్రిల్ 3న ప్రకటించింది. దేశంలోని రెండు రాజ్యాంగ వ్యవస్థలకు సంబంధించిన అంశం కావడంతో సుదీర్ఘ వాదనలను విన్న జస్టిస్ గవాయ్ ధర్మాసనం.. మూడు నెలల్లోగా చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు సూచిస్తూ తీర్పును వెలురించింది. దీంతో అక్టోబర్ 31వ తేదీలోపు ఫిరాయింపు పిటీషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## మాలేగావ్ పేలుడు కేసులో ముంబైలోని ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు

### – ప్రజ్ఞా ఠాకూర్ సహా ఏడుగురు నిర్దోషులే..

ముంబై జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మాలేగావ్ పేలుడు కేసులో ముంబైలోని ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితులుగా అభియోగాలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ, బీజేపీ నాయకురాలు ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్ సహా మొత్తం ఏడుగురిని ఎన్ఐఏ కోర్టు నిర్దోషులుగా తేల్చింది. ఈ మేరకు గురువారం సంచలన తీర్పు వెలువరించింది. 2008 సెప్టెంబరు 29న మహారాష్ట్రలోని నాసిక్‌లో గల మాలేగావ్‌లో మసీదుకు సమీపంలో భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ పేలుడు తీవ్రతకు ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. వంద మందికి పైగా గాయపడ్డారు. ఈ కేసులో తొలుత యాంటీ టెర్రర్ స్క్వాడ్ (ఏటీఎస్) దర్యాప్తు ప్రారంభించగా.. ఆపై కేసు దర్యాప్తు బాధ్యతలను ఎన్ఐఏ స్వీకరించింది. ఈ కేసులో ఇప్పటివరకు 220 మంది సాక్షులను విచారించారు. ఈ ఘటనపై 17ఏళ్ల పాటు విచారణ జరగ్గా తాజాగా జస్టిస్ ఏకే లహోటి తీర్పును వెలువరించారు. ఇక ఈ కేసులో ప్రజ్ఞా ఠాకూర్‌తోపాటూ లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్, మేజర్ (రిటైర్డ్) రమేష్ ఉపాధ్యాయ్, సుధాకర్ చతుర్వేది, అజయ్ రహిర్కర్, సుధాకర్ ధర్ ద్వివేది అలియాస్ శంకరాచార్య, సమీర్ కులకర్ణిలను నిర్దోషులుగా తేల్చింది


## జాతీయ సహకార అభివృద్ధి సంస్థకు రూ.2వేల కోట్ల గ్రాంట్.. ఆమోదం తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ, జులై 31: రూ.2వేల కోట్ల వ్యయంతో జాతీయ సహకార అభివృద్ధి సంస్థకు గ్రాంట్-ఇన్-ఎయిడ్ కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన గురువారం కేంద్ర కేబినెట్ సమావేశమైంది. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టులకు మంత్రివర్గం ఆమోద ముద్రవేసింది.

కేబినెట్ సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వివరాలు వెల్లడించారు. 2025-26 నుంచి 2028-29 వరకు నాలుగేళ్ల కాలానికి పథకం కోసం రూ. 2వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

నాలుగు సంవత్సరాల కాలంలో ఎన్‌సీడీసీ (ఔఅఆఅ) రూ. 20వేల కోట్లు సేకరిస్తుందని.. ఈ నిధులను కొత్త ప్రాజెక్టులు, పాంట్ల విస్తరణ, సహకార సంస్థలకు రుణాలు ఇవ్వడం, మూలధన అవసరాలను తీర్చేందుకు రుణాలు అందించేందుకు వినియోగిస్తుందని తెలిపారు.

దీంతో 13,288 సహకార సంఘాల్లోని 2.9 కోట్ల మంది సభ్యులకు ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా పాడి పరిశ్రమ, పశువులు, మత్స్య సంపద, చక్కెర, వస్త్రాలు, ఆహార ప్రాసెసింగ్, గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజ్ వంటి వివిధ రంగాలలో కార్మికులతో పాటు మహిళల నేతృత్వంలో సహకార సంస్థలు నడుస్తున్నాయి. ఈ సందర్భంగా ఇటార్సి-నాగ్‌పూర్ నాల్గో రైల్వేలైన్‌పై ఆయన అప్‌డేట్ ఇచ్చారు. మోదీ ప్రభుత్వం ఇటార్సీ, నాగ్‌పూర్ మధ్య నాలుగో లైన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపిందన్నారు. ఢిల్లీ-చెన్నైతో పాటు ముంబయి- హౌరాను కలిపే కారిడార్‌లో నిర్మించనుండగా.. ఇది నాలుగు దిశలను కలిపే స్థానం అని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.



## రష్యాలో మరోసారి భారీ భూకంపం

న్యూఢిల్లీ, జులై 31: రష్యా లో మరోసారి భారీ భూకంపం సంభవించింది. కురిల్ ఐలాండ్ లో గురువారం భూమి కంపించింది. భూకంపం తీవ్రత రిక్టరు స్కేలుపై 6.5గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. నిన్న కమ్‌చట్కా ద్వీపకల్పంలో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. అదే ప్రాంతానికి 200 మైళ్ల దూరంలో తాజాగా ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. వరుస భూకంపాలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అయితే, తాజా భూకంపం కారణంగా ఎలాంటి సునామీ హెచ్చరికలూ జారీ కాలేదు.


రష్యాలోని కమ్‌చట్కా ద్వీపకల్పంలో బుధవారం ఉదయం 8.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే 4.4 అంతకంటే ఎక్కువ తీవ్రతతో 125 సార్లు భూమి కంపించినట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. వాటిలో మూడు 6.0 తీవ్రతకంటే ఎక్కువగా నమోదైనట్లు పేర్కొంది. రష్యాలో ఇంత తీవ్రతతో భూకంపం రావడం ఇదే మొదటిసారి. భూకంపం కారణంగా వచ్చిన సునామీ ప్రభావంతో కామ్‌చట్కా ఉపఖండంలోని నౌకాశ్రయాలతోపాటు జపాన్ తీరం, అమెరికాలోని హవాయి రాష్ట్ర తీరప్రాంతాలు సముద్రపు నీటిలో మునిగిపోయాయి. మూడు మీటర్ల కన్నా ఎత్తయిన అలలు వరుసగా దాడి చేశాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. తీర ప్రాంత ప్రజలు ఎత్తయిన ప్రదేశాలవైపు పరుగులు తీయడంతో అనేక దేశాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. భూకంపం, సునామీ కారణంగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించినట్లు ఎటువంటి సమాచారం వెలువడలేదు.

## హైదరాబాద్‌లో స్టీల్ మహాకుంభ్ రోడ్‌షో



హైదరాబాద్, జూలై 31, (ఎక్స్ ప్రెస్ న్యూ స్ );సెప్టెంబర్‌లో ముంబయిలో జరగనున్న మహా కుంభ్ మేళాకు ముందస్తు కార్యక్రమంగా "స్టీల్ మహాకుంభ్ రోడ్‌షో" హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పరిశ్రమ నిపుణులు, కీలక స్టేక్‌హోల్డర్లు, మరియు నాయకులు పాల్గొని, అభివృద్ధి చెందుతున్న భారత్‌లో స్టీల్ రంగ భవిష్యత్తుపై చర్చించారు. ఈ రోడ్‌షోను తెలంగాణ ఐరన్ ఢ స్టీల్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ సస్టెయినబుల్ స్టీల్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, స్టీల్ మంత్రిత్వశాఖ మరియు జఔఆఖ సహకారంతో నిర్వహించారు. కార్యక్రమం గ్రీన్ స్టీల్, ఎనర్జీ ఎఫిషియెన్సీ, మరియు మార్కెట్ అవుట్‌లుక్ వంటి ప్రధాన అంశాలపై దృష్టి సారించింది. ంఎఎఈం అధ్యక్షులు యోగేష్ మండ్వానీ మాట్లాడుతూ, మహా కుంభ్ మేళా సందర్భాన్ని ముందుకు తీసుకెళ్తూ, బలమైన మౌలిక వసతుల నిర్మాణానికి స్టీల్ కీలక పాత్ర పోషిస్తున్నదన్నారు. పరిశ్రమ పర్యావరణ అనుకూలతను సాధించడంలో ముందడుగు వేయాలన్నారు. ప్రాజెక్ట్ చైర్మన్ ప్రకాష్ గోయెంకా మాట్లాడుతూ, రోడ్‌షో యొక్క ప్రధాన ఉద్దేశ్యం జ్ఞాన మార్పిడి మరియు ఉత్తమ ఆచరణలను ప్రోత్సహించడమే నన్నారు. "మా లక్ష్యం పచ్చని మరియు సమర్థవంతమైన స్టీల్ పర్యావరణాన్ని నిర్మించడమే," అన్నారు. ఃమో ముసాయిదా ప్రమాణాలపై మాట్లాడుతూ, "ంఎఎఈం జోక్యం వల్ల ఈ ముసాయిదా తాత్కాలికంగా నిలిపివేయబడింది," అన్నారు. భారతదేశం యొక్క ప్రత్యేక భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ? ఉష్ణమండల వాతావరణం, సముద్రతీర ప్రాంతాలు, మరియు అధిక ఫాస్ఫరస్ కలిగిన ఐరన్ ఓర్‌ను దృష్టిలో ఉంచుకొని ఃమో ప్రమాణాలను సవరించాలని ఃమోను కోరారు.

## జోగినాథ్ సేవలు చిరస్మరణీయం : మంత్రి దామోదర



మెదక్, జులై 31: మాజీ సర్పంచ్ డాకూరి జోగినాథ్ గ్రామ సర్పంచిగా చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జోగిపేట గ్రామ మాజీ సర్పంచ్ డాకూరి జోగినాథ్ వర్ధంతి వేడుకలను గురువారం జోగిపేట మున్సిపల్ పట్టణం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ వర్ధంతి కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

జోగినాథ్ చిత్రపటానికి మంత్రి దామోదర పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి పాటుపడిన నాయకుడు జోగినాథ్ అని కొనియాడారు. ఆయన చేసిన సేవలు మరవలేనివన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్ మోహన్, రాజా నర్సింహ ఫౌండేషన్ చైర్మన్ త్రిష దామోదర, మున్సిపాల్ మాజీ చైర్మన్ గూడెం మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్ జోగినాథ్ కుటుంబ సభ్యులు మాజీ ఎంపీటీసీ డాకూరి వెంకటేశం, మాజీ కౌన్సిలర్ డాకూరి శివశంకర్, మాజీ కౌన్సిలర్లు ఎస్. సురేందర్ గౌడ్, పిట్ల లక్ష్మణ్, హరికృష్ణ గౌడ్, నాగరాజు నాని, పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ల ప్రవీణ్ కుమార్, నాయకులు మధు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ రోజునే ప్రయోజనాలు.. స్థానిక సంస్థల ధనపు కలెక్టర్ అరుణ శ్రీ

కరీంనగర్, జులై 31: ఉద్యోగులు పదవీ విరమణ రోజునే ప్రయోజనాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జే. అరుణ శ్రీ తెలిపారు. పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా పని చేసి పదవీ విరమణ పొందిన ఆవునూరి మల్లయ్య, రేణికుంట్ల పోచయ్య, కుమ్మరి రాయ పోచమ్మలకు గురువారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.

వీడ్కోలు కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ పదవీ విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఈఎల్ ప్రయోజనం ప్రొసీడింగ్స్ విరమణ రోజునే అందజేస్తున్నట్లు తెలిపారు. ఇక ముందు కూడా పదవీ విరమణ పొందేవారికి అదే రోజున గ్రాట్యుటీతోపాటు ఇతర ఆర్థిక ప్రయోజనాలు కూడా అందజేస్తామని తెలిపారు. ఉద్యోగ విరమణతో బాధపడకుండా ఇతర వ్యాపకాల్లో నిమగ్నం కావాలన్నారు. అనంతరం వారికి వీడ్కోలు పలుకుతూ ప్రభుత్వ వాహనాల్లో గౌరవంగా ఇంటికి పంపించారు. కార్యక్రమంలో ఈఈ రామన్, ఏసీపీ శ్రీహరి, డీఈ జమీల్, ఏఈ మీర్, ఆర్ఓ ఆంజనేయులు, అకౌంట్స్ ఆఫీసర్ రాజు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, ఆరఐ శంకర్ రావు, శానిటరీ ఇన్స్పెక్టర్లు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే రైతులకు అధిక లాభాలు

ఆదిలాబాద్, జులై 31: వ్యవసాయ శాస్త్రవేత్తలు , అధికారుల సూచనలు పాటిస్తే రైతులు అధిక లాభాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కే సుష్మ అన్నారు. నాణ్యమైన విత్తనం- రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా చౌటపల్లి, తాండూర్ గ్రామాలలో వరి, పెసర పంటల క్షేత్ర సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. పంటల సాగు, వాతావరణ మార్పు, పంటల స్వభావం, సీజన్‌లో వచ్చే చీడ పీడల నివారణ వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు వరి, పెసర విత్తనాలను సరఫరా చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు యూ శంకర్, ఎం వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రూ. 40 కోట్ల విలువైన గంజాయి సీజ్

హైదరాబాద్, జులై 31:శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఓ మహిళా ప్రయాణికురాలి నుంచి భారీ స్థాయిలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మహిళా బ్యాంకాక్ నుంచి వయా దుబాయి మీదుగా హైదరాబాద్ నగరానికి గంజాయిని తీసుకొచ్చినట్లు అధికారులు నిర్ధారించారు.

వివరాల్లోకి వెళ్తే.. ఓ మహిళా ప్రయాణికురాలు బ్యాంకాక్ నుంచి దుబాయి మీదుగా హైదరాబాద్ నగరానికి భారీగా గంజాయి తీసుకువస్తున్నట్లు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులకు పక్కా సమాచారం అందింది.

దీంతో బుధవారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అధికారులు నిఘా పెంచారు. దుబాయి నుంచి మహిళా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవ్వగానే ఆమెను అదుపులోకి తీసుకుని, లగేజీని తనిఖీ చేశారు.

ఆమె వద్ద 40 కిలోల గంజాయిని గుర్తించారు. ఇది నిషేధిత హైడ్రోపోనిక్ గంజాయి అని అధికారులు నిర్ధారించారు.


ఈ గంజాయి విలువ రూ. 40 కోట్ల విలువ చేస్తుందని తెలిపారు. అయితే ఈ మహిళ గత కొంతకాలం నుంచి గంజాయి దందా కొనసాగిస్తున్నట్లు విచారణలో తేలింది. బ్యాంకాక్ నుంచి నేరుగా శంషాబాద్‌కు వస్తే అనుమానం వస్తుందని చెప్పి.. అక్కడ్నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లి.. హైదరాబాద్‌కు వస్తున్నట్లు నిర్ధారణ అయింది.

థాయిలాండ్‌లో 2022 నుంచి గంజాయి సాగును అధికారికంగా సాగు చేస్తున్నారు.

గంజాయి సాగుపై వారు నిషేధం ఎత్తేశారు. అప్పట్నుంచి ఇండియాలోని కొందరు స్మగ్లర్లు సిండికేట్‌గా ఏర్పడి.. హవాలా మార్గంలో గంజాయి దందా కొనసాగిస్తున్నారు. నేరుగా బ్యాంకాక్ నుంచి ఇండియాకు రాకుండా వయా దుబాయి నుంచి హైదరాబాద్‌కు వచ్చి గంజాయి విక్రయాలు కొనసాగించి కోట్ల రూపాయాలు దండుకుంటున్నట్లు తెలుస్తోంది.

## అన్ని చర్యలు తీసుకుంటాం.. ట్రంప్ టారిఫ్‌పై మంత్రి పీయూష్ గోయల్ ప్రకటన

న్యూఢిల్లీ, జులై 31:జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోనున్నట్లు వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌అన్నారు. భారతీయ ఉత్పత్తులపై 25 శాతం సుంకాన్ని విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేసిన నేపథ్యంలో.. ఇవాళ కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ లోక్‌సభలో ఆ అంశంపై మాట్లాడారు. సుమోటో స్టేట్మెంట్ ఇచ్చిన ఆయన మాట్లాడుతూ.. ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌ల వల్ల కలిగే పరిణామాలను స్టడీ చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. కొత్త పన్ను విధానం ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్నట్లు ట్రంప్ వెల్లడించిన విషయం తెలిసిందే. భారత్‌ది డెడ్ ఎకానమీ అని ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి కౌంటర్ ఇచ్చారు. బలహీనమైన ఆర్థిక వ్యవస్థ నుంచి భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద మూడవ ఆర్థిక వ్యవస్థగా అవతరించినట్లు ఆయన చెప్పారు.

# అత్యంత ప్రమాదకరమైనది లంగ్ క్యాన్సర్ !

## (01 ఆగష్టు "ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినం" సందర్భంగా)

క్యాన్సర్ వ్యాధి అంటేనే భయపడతాం. క్యాన్సర్ వ్యాధికి పూర్తి చికిత్స పద్ధతులు లేవవి కంపించి పోతాం. క్యాన్సర్ వ్యాధుల్లో విస్తృతమైనదిగానే కాకుండా ప్రాణాంతకమైనదిగా ఊపిరితిత్తుల లేదా లంగ్ క్యాన్సర్‌ను గుర్తించారు. తొలుత వ్యాధి లక్షణాలు కనుపించకపోవడంతో అంతిమ దశలో నిర్ధారణ జరిగి ప్రాణాంతక దుస్థితికి చేరుతుంది. ఊపిరితిత్తుల క్యాన్సర్ పట్ల అవగాహన కొరవడడం, ఆలస్యంగా రోగ నిర్ధారణ జరగడం, నివారణ మార్గాలను ప్రచారం చేయడం, ఈ వ్యాధి పట్ల పలు అపోహలు చక్కర్లు కొట్టడంతో దీని పట్ల సంపూర్ణ కనీస జ్ఞానం కలిపించడానికి ప్రతి ఏట 01 ఆగష్టు రోజున "ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినం (వరల్డ్ లంగ్ క్యాన్సర్ డే)" పాటించడం 2012 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినం – 2025 ఇతివృత్తంగా "యునైటెడ్ బై యూనిక్" అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు.

ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు కారణాలు:

ఊపిరితిత్తుల కణజాలం అపరిమితంగా, నియంత్రణ కోల్పోయి పెరడంతో గడ్డలు ఏర్పడడాన్ని లంగ్ క్యాన్సర్ అని పిలుస్తూ, ఈ గడ్డలు ఇతర శరీర భాగాలకు వ్యాపించడం కూడా గమనించారు. ప్రపంచవ్యాప్తంగా పలు రకాలైన క్యాన్సర్లలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వల్లనే అధిక మరణాలు నమోదు అవుతున్నాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధికి ప్రధాన కారణం స్మోకింగ్ లేదా పొగ తాగడాన్ని గుర్తించారు. ఫస్ట్ హాండ్ లేదా సెకండ్ హాండ్ స్మోకింగ్ లేదా ప్రత్యక్ష, పరోక్షంగా పొగ తాగడంతో పాటు పలు ఇతర కారణాల వల్ల కూడా లంగ్ క్యాన్సర్ రావచ్చు. దీర్ఘకాలం పాటు కలుషిత గాలి పోల్చడం, పని ప్రదేశంలో ఆజ్‌బెస్టాస్/డిజిల్/సిలికా/ఆర్సనిక్/రెడాన్ వాయువులను పీల్చడం, జన్యుపరంగా తల్లితండ్రుల నుంచి పిల్లలకు సోకడం లాంటి కారణాలతో కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్ రావచ్చు.

ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, చికిత్స పద్ధతులు:

ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధిగ్రస్థుల్లో దగ్గు, ఛాతి నొప్పి, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, శ్వాస ఆడకపోవడం, దగ్గినపుడు రక్తం పడడం, అలసిపోవడం, బలహీనత, గొంతు బొంగురు పోవడం లేదా కఠ స్వరం మారడం, మెడ వాపు, ఎముకల నొప్పి, న్యుమోనియా, బ్రాంకైటిస్ లాంటి పలు రోగ లక్షణాలు బయట పడతాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి నిర్ధారణకు ఎక్స్–రే, సిటీ స్కాన్, పిఈటి–సిటీ స్కాన్, బ్రాంకోస్కోపీ, బయాప్సీ, స్పూటమ్ సైటాలజీ లాంటి పరీక్షలు చేస్తారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్స మార్గాల్లో సర్జరీ, కీమోథెరపీ, రేడియోథెరపీ, ఇమ్యూనోథెరపీ, పలు అత్యాధునిక డిజిటల్ టెక్నిక్స్‌ను వినియోగిస్తున్నారు.

ఊపిరితిత్తుల క్యాన్సర్ నివారణ మార్గాలు:

పొగ తాగడం ప్రధాన కారణంగా గుర్తించబడిన ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి పొగ తాగని వ్యక్తులకు కూడా రావచ్చు. పొగ తాగడమనే దురవాటుకు దూరంగా ఉ ండడంతో పాటు త్వరగా తొలి దశలోనే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం, కలుషిత గాలి పేల్చకుండా చూసుకోవడం, పని ప్రదేశంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

తొలి దశలో గుర్తించి ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధిని చికిత్సతో నయం చేయవచ్చు. వ్యాధి నిర్ధారణ అయిన సందర్భంలో తగిన చికిత్సలు తీసుకోవాలి. క్యాన్సర్ అంటే సత్వర మరణం కాదని, క్యాన్సర్‌కు కూడా చికిత్స ఉందని ధైర్యంగా ఎదుర్కొని వైద్యం చేయించుకోవాలి.

–డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# విద్యార్థుల మేధస్సును వెలికితీయడానికి డిజిటల్ తరగతులు నిర్వహించాలి

**–జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య .**
**–విద్యార్థులకు డిజిటల్ క్లాసును బోధించిన కలెక్టర్ .**



సంగారెడ్డి జూలై 31(నేటి నిజం ప్రతినిధి) కంది మండలకేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ఆకస్మికగా సందర్శించారు .

ఈ సందర్భముగా విద్యార్థులకు అందిస్తున్న విద్యా, ఆహారం తదితర అంశాలపై కలెక్టర్ పరిశీలించారు . ప్రభుత్వ పాఠశాలలలో సకలసదు పా యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

తరగతిలో విద్యార్థులతో కలిసి కూర్చుని ఉపాధ్యాయురాలు బోధించే విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, తాను కూడా విద్యార్థులకు డిజిటల్ తరగతిని బోధించారు. విద్యార్థుల మేధస్సును వెలికితీయడం కోసం డిజిటల్ పాఠాలు కీలకమని తెలిపారు. ఉపాధ్యాయులు ఈ దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఆరోగ్యం , విద్య , ఆహార నాణ్యతలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని , నూతన డైట్ మెనూ ప్రకారం ప్రతి ఒక్కరికి మంచి ఆహారాన్ని అందించాలని సూచించారు, ఆహార నాణ్యతను పరిశీలించారు . పాఠశాల ఆవరణలలో క్రమం తప్పకుండా సానిటేషన్ నిర్వహిస్తూ ఉండాలని,సూచించారు. పిల్లల యొక్క మేధస్సును వెలికి తీయడం కోసం డిజిటల్ క్లాసులు నిర్వహిస్తూ ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ బడుల్లో గణనీయంగా విద్యార్థుల అడ్మిషన్లు, హాజరు శాతం పెరిగినందున అందుకు అనుగుణంగా వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని పాఠశాల ఉపాధ్యాయులను ఆదేశించారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు , సంబంధిత అధికారులు ,తదితరులు పాల్గొన్నారు .

# ఒక్క ఫిర్యాదు చేయండి చాలు - అనిశా

అమరావతి, జులై 31: రెవెన్యూ శాఖ లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన వైనం చోటుచేసుకుంది. నంద్యాల జిల్లా ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఆర్.రమేష్ అనే వ్యక్తి పొలం విషయం లో రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న జూపాడుబంగ్లా కు చెందిన ఈశ్వరయ్య అనే రైతు వద్ద నుండి 40వేల రూపాయలు లంచం డిమాండ్ చేశాడని రైతు ఈశ్వరయ్య కర్నూలు జిల్లా ఏసీబీ అధికారులను ఆశ్రయించి, వారికి వివరాలను అందించారు.

ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఆర్.రమేష్ లంచం డబ్బులు తీసుకోవటానికి జూపాడు బంగ్లాకు వెళ్ళి రైతు ఈశ్వరయ్య వద్ద లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ సోమన్న, సిఐ కృష్ణయ్య, ఎస్ఐ సుబ్బారాయుడు, సిబ్బంది రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు ఏసీబీ అధికారులు. పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్ ఆర్.రమేష్ ను విచారిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ సోమన్న తెలిపారు.

ఏసీబీ దాడుల్లో డీఎస్పీ సోమన్నతో పాటు సిఐ కృష్ణయ్య, ఎస్ఐ సుబ్బారాయుడు, ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు. రమేష్ ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆర్డీవో కార్యాలయంలో తలుపులు మూసివేసి ఆర్డీఓను, ఉద్యోగులను అధికారులు ప్రశ్నించారు.

జిల్లాలో ఇటీవల కాలంలో ఏసీబీ దాడులు అధికమయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వం ఇచ్చే తమ జీతంతో సరిపుచ్చుకోక అత్యాశతో, అవినీతికి పాల్పడి, లంచాలకు అలవాటు పడితే ఎవరైనా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని ఏసీబీ డీఎస్పీ సోమన్న తెలిపారు. ఫిర్యాదుదారులకు ఎటువంటి ఇబ్బంది కలగనీయమని తెలిపారు.

పలు ప్రభుత్వ శాఖలతో బాటు, విద్యుత్, రెవెన్యూ, విద్యాశాఖ ఇంకా పంచాయతీ రాజ్, మున్సిపల్, వైద్య–ఆరోగ్య శాఖ, జిల్లా రిజిస్టర్ కార్యాలయం సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో అవినీతి పెరిగిపోయిందని, అవినీతి నిరోధక శాఖ అధికారులు గట్టి నిఘా పెట్టి అవినీతి అధికారులను, లంచాల కోసం ప్రజలను పీడించే వారిని తగిన విధంగా శిక్షించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరే ప్రతి పేషెంటుకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలి

**–వైద్యాధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య ,**



సంగారెడ్డి జూలై 31(నేటి నిజం ప్రతినిధి)గురువారం కంది మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ... వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా? అందరూ విధులకు హాజరయ్యారా? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు . ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను, సిబ్బంది హాజరు వివరాలను, క్షేత్రస్థాయిలో ఆరోగ్య సర్వే, నివేదికల రిజిస్టర్లను తనిఖీ చేశారు . ఆసుపత్రిలో రోజూ వచ్చే ఓపి పేషెంట్ల సంఖ్య, ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. అలాగే రోగులకు ఇచ్చే మందుల చీటీలను అర్థమయ్యే రీతిలో వ్రాయాలని సూచించారు. ఆసుపత్రిలో ఉన్న బెడ్ల సంఖ్య, నెలవారీగా జరిగే డెలివరీల గణాంకాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మెడిసిన్స్ అందుబాటులో ఉండేలా చూడాలని, మందుల కొరత లేకుండా ముందుగానే సరఫరా చేసుకోవాలన్నారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి, అవసరమైన సమయంలో చికిత్స అందించాలని స్పష్టంగా తెలిపారు. తనిఖీల సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులతో కూడా కలెక్టర్ మాట్లాడారు. వారికి అందుతున్న వైద్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మంచి వైద్యం అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం నిబద్ధతతో పనిచేయాలని ఆమె తెలిపారు. ఈ తనిఖీలో స్థానిక వైద్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానం.

సంగారెడ్డి జూలై 31(నేటి నిజం ప్రతినిధి)హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట, రామంతపూర్ లో 2025 – 26 విద్యా సంవత్సరంలో 1వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో 3 గురికి (హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేటలో 2 సీట్స్ మరియు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రామంతపూర్ లో 1 సీట్ ) విద్యార్థిని విద్యార్థుల ప్రవేశము కొరకు దరకాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీ టి. అఖిలేష్ రెడ్డి గారు , ఉప సంచాలకులు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు .

విద్యార్థిని విద్యార్థులు తేది :01-06-2018 నుండి 31-05-2019 లోపు జన్మించినవారై ఉండవలెను ఆసక్తి గల వారు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తు ఫారము నింపి రెండు ఫోటో లతో పాటు సంబందిత తహసిల్దార్ చే ధృవీకరించబడిన మీ సేవ నుండి పొందిన కులము మరియు ఆదాయము నివాస ధృవీకరణ సర్టిఫికేట్ మరియు విద్యార్థి పుట్టిన తేది ధృవీకరణ పత్రముతో పాటు తల్లి తండ్రుల యొక్క సంవత్సర ఆదాయము గ్రామ పరిధిలో రూ.1.50,000/-, పట్టణ పరిదిలో రూ.2,00,000/- మించి ఉండరాదు. ఒరిజినల్ ధృవీకరణ పత్రములు విడిగా జతపరచవలయును.

దరఖాస్తు ఫారములు ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ 1వ అంతస్తు, ఉప సంచాలకులు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయము, సంగారెడ్డి జిల్లా , కార్యాలయపు పని వేళలో ఉచితంగా పొందవచ్చని తెలిపారు .

దరఖాస్తులను తేది:-08-08-2025 సాయంత్రం 5.00 గంటల వరకు ఉప సంచాలకులు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయములో స్వీకరించబడును. అదే విదంగా తేది: 11-08-2025 రోజున మధ్యాహ్నం 12.00 గంటలకు జిల్లా కలెక్టర్ సంగారెడ్డి గారి ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థుల తల్లి తండ్రుల సమక్షములో , ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో డ్రా తీసి ఎంపిక చేయబడును .

ఈ అవకాశామును జిల్లా షెడ్యూల్డ్ కులాల విద్యార్థిని విద్యార్థుల తల్లి తండ్రులు సద్వినియోగం చేసుకోగలరని శ్రీ టి. అఖిలేష్ రెడ్డి గారు , ఉప సంచాలకులు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కోరారు.

# 70గేట్లు ఎత్తి నీటి విడుదల

**–ఇన్, ఔట్ ఫ్లో 2.55 లక్షల క్యూసెక్కులు**
**–గరిష్ఠ నీటిమట్టానికి ప్రకాశం బ్యారేజీ**
**–70 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల**
**–ప్రవాహం మరింత పెరిగే అవకాశం**
**–అప్రమత్తమైన అధికారులు**
**–నదీ పరివాహక ప్రాంతాలలో రెడ్ ఎలర్ట్**
**–43 ముంపు ల ప్రాంతాల గుర్తింపు..**
**–పెద్ద ఎత్తున ఇసుక బస్తాలు సిద్ధం..**
**–ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు**
**–పరిస్థితులు స్వయంగా సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీశ**

అమరావతి, జులై 31: కృష్ణా నది ఎగువ ప్రాంతాల నుండి భారీ ఎత్తున వరదనీరు దిగువకు విడుదల చేయడంతో ప్రకాశం బ్యారేజీ కి వరద నీరు గంటగంటకు పోటెత్తు తోంది. పులిచింతల ప్రాజెక్టు నుండి దిగువకు సుమారు 3లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో బుధవారం ఆ వరద నీరంతా ప్రకాశం బ్యారేజీకి చేరుకోవడంతో ప్రస్తుతం బ్యారేజీ వద్ద గరిష్ట నీటిమట్టం నమోదైంది. గురువారం ఉదయానికి ప్రకాశం బ్యారేజీకి ఇన్, ఔట్ ఫ్లో 2.55లక్షల క్యూసెక్కులు ఉండగా, బ్యారేజీ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 3.07 టీఎంసీలకు చేరుకోవడంతో మిగులు జలాలను బ్యారేజీ 70గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు.

ఇన్ ఫ్లో 2,54,034 క్యూసెక్కులు ఉండగా, కృష్ణ తూర్పు మెయిన్ కెనాల్ కు 10,187 క్యూసెక్కులు, కృష్ణ పశ్చిమ మెయిన్ కెనాల్ కు 6522 క్యూసె క్కులు, గుంటూరు కెనాల్ కు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో మొత్తం కెనాల్ కు 16,909 క్యూసెక్కులుగా ఉంది.

బ్యారేజీకి గరిష్ట నీటిమట్టం 12అడుగులకు చేరుకోవ డంతో మొత్తం బ్యారేజీ 70 గేట్లకు గాను 15 గేట్లు 6 అడుగుల మేర, మిగిలిన 55 గేట్లను 5 అడుగు మేర ఎత్తి దిగువకు 2,37,125 క్యూసె క్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజీకి భారీ ఎత్తున వరద నీరు చేరుకోవడం, సముద్రం లోకి దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో అప్రమత్తమమైన అధికారులు ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించారు.

# బీసీ గురుకులాల్లో ఆకస్మిక తనిఖీలు..

హైదరాబాద్, జులై 31: : బీసీ గురుకులాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని బీసీ గురుకులాల కార్యదర్శి శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం సుల్తానాబాద్‌లోని బీసీ గురుకుల వసతి గృహంతో పాటు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈసందర్భంగా గురుకులంలో, డిగ్రీ కాలేజీలో సౌకర్యాలు, విద్యా బోధనపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ గురుకులాల్లో సౌకర్యాల కల్పన కోసం ప్రత్యేక కృషి చేస్తోందని, అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా విద్యార్థులకు వసతులు కల్పించాలని ఆదేశించారు. అలాగే విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యతతో పా టు రుచికరమైనవిగా ఉండాలని సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు. తరచూ అధికారులు ఇలాంటి తనిఖీలు చేయాలని పలువురు పేర్కొంటున్నారు.

# కాంగ్రెస్ హయం లో ఖేడ్ ప్రాంతానికి ఐఎస్ఐ హోదా అధికారి నియామకం

**–సబ్ కలెక్టర్ గా ఉమా హారతి ఐఏఎస్ అధికారిగా రావడంతో హర్షిస్తున్న ప్రజలు.**

సంగారెడ్డి జూలై 31(నేటి నిజం ప్రతినిధి)తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కి చివరి నియోజకవర్గం,అటు మహారాష్ట్ర ఇటు కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన వెనుకబడిన తాలూకా నారాయణఖేడ్ . గతంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జిల్లాలు ఏర్పాటు సమయంలో బి ఆర్ ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఖేడ్ ప్రాంత ప్రజలు నారాయణఖేడ్ ప్రత్యేక జిల్లా కావలని ప్రభుత్వానికి కోరిన సందర్భాలు, మెమోరాండం అందించి ధర్నాలు కూడా చేసిన సందర్భాలు కలవు. ఆనాటి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ రోనాల్డ్ రోస్ గారికి టీచర్ అశోక్ ,టీచర్ రాములు ,అడ్వకేట్ అశోక్ రెడ్డి , జర్నలిస్టు దేవదాస్ నారాయణఖేడ్, రాములు, బస్వరాజ్ , తదితరులు ఆందోల్, నాల్కల్ జహీరాబాద్, వివిధ మండలాల వారు కలిసి ఖేడ్ మంజీరా జిల్లా కావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అప్పటి కలెక్టర్ రోనాల్డ్ రోస్ గారికి మెమోరడం ఇచ్చారు.

ఆనాడు ఈ వార్తను అన్ని పత్రికలు ప్రచురించడం జరిగింది. అప్పటి ఆర్థిక శాఖ మంత్రి గా ఉన్న హరీష్ రావు స్పందించి ఆగమేఘాల మీద నారాయణఖేడ్ వచ్చి నారాయణఖేడ్ ను రెవెన్యూ డివిజన్ గా ప్రకటించారు. ఇంతవరకు ఆర్డిఓ అధికారంలో పరిపాలన జరిగింది. నారాయణఖేడ్ ప్రాంతం వెనకబడిన ప్రజల ప్రాంతం , వలసవాదుల ప్రాంతం.

రెక్కాడితే కానీ డొక్కాడని ప్రాంతం, ఆకలి కేకల ప్రాంతం, ఎస్సీ, ఎస్టీలు, బీసీలు దళిత జనాంగమే ఎక్కువగా ఉండే ప్రాంతం. ఇక్కడి ప్రజలు తమ జీవనాధారం కోసం హైదరాబాద్, నిజామాబాద్, సిరిసిల్ల, సోలాపూర్ వంటి ఇతర రాష్ట్రాలకు జిల్లాలకు బ్రతుకు దెరువు కోసం వలస వెళ్తారు. ఇక్కడ పేదలకు అంత పట్టించుకునే నాయకులే కరువు. బీద పేద బడుగు బలహీన వర్గాల వారు ఆఫీసులకు వెళ్తే ఎంత చిన్న పని అయినా చివరికి రేషన్ కార్డు అయినా , అధికారుల నుండి దళారుల వరకు బెడద తప్పదు. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఈ ప్రాంత ప్రజల న్యాయం కోసం నారాయణఖేడ్ ప్రాంతానికి సబ్ కలెక్టర్ హోదా లో ఐఏఎస్ అధికారిని నియమించడం హర్షించ దగ్గ విషయం. నారాయణఖేడ్ కు నూతనముగా బాధ్యతలు తీసుకున్న సబ్ కలెక్టర్ ఉమా హారతి ఐఏఎస్ వారి పాలన ద్వారా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, అధికారులు కూడా మేల్కొని పనిచేస్తారని , నారాయణఖేడ్ ప్రాంత ప్రజలు ఆశిస్తున్నారు. ఇందు విషయమై కొందరు కృతజ్ఞత లు తెలియజేస్తున్నారు. ఇక్కడ ప్రాంత ప్రజలందరూ అనుకున్న విధంగా నారాయణఖేడ్ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఖేడ్ ప్రాంత అన్ని డిపార్ట్మెంట్ల అధికారులు సబ్ కలెక్టర్ ఉమా హారతి పాలనలో పేద ప్రజలకు మేలు జరిగి నారాయణఖేడ్ ఏ మేరకు అభివృద్ధి చెందుతుందో వేచి చూద్దాం.!!

# కేంద్ర మంత్రితో కర్నూలు ఎంపీ బస్తిపాటి, ఎం.ఎల్.ఏ బీవీ భేటీ !



న్యూఢిల్లీ, జులై 31: కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మిగనూరు ఎం.ఎల్.ఏ బీ వి జయ నాగేశ్వర రెడ్డిలు సమావేశామయ్యారు. బుధవారం నాడు ఢిల్లీలోని కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. కర్నూలు నుంచి ఎమ్మిగనూరు, ఆదోని మీదుగా హాస్పెట్ తోర్నగల్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలంటూ వినతి పత్రం అందజేశారు.

ఈ రైల్వే లైన్ ఏర్పాటు చేయడం ద్వారా పరిశ్రమల విస్తరణ, కొత్త పెట్టుబడుల ఆకర్షణ, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి ఉతం లభిస్తుందని వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్ష , పరోక్ష ఉపాధి, ప్రాంతీయ నిరుద్యోగితను తగ్గించడం తో పాటు స్థానికుల జీవన ప్రమాణాలు ఎఅలాగే ఎమ్మిగనూరు, ఆదోని చుట్టూ పరిసర ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య, విద్య, రవాణ, అత్యవసర సేవలు విరివిరిగా అందుబాటులోకి వస్తాయని వారు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కి వివరించారు.

# 2019నాటి కేసు.. 10మందికి జైలుశిక్ష

తిరుపతి, జులై 31:: ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన 10మందికి ఒకొక్కరికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.6లక్షల చొప్పున జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పునిచ్చారు. రెడ్ శాండర్స్ స్మగ్లింగ్ నిరోధక టాస్క్ ఫోర్స్ అధిపతి ఎల్.సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.ఈ నేపథ్యంలో తమిళనాడులోని తిరువన్నామలై, వేలూరు జిల్లాకు చెందిన సి.విశ్వనాథన్, డి.సేతు, డి.రమేష్, ఎం.సంపత్, వి.రత్నం, ఎం.బూఛాయాన్, జె.కుమార్, సి.ప్రభు, ఎం.సురేష్, సి.రామర్ అనే పదిమంది ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పెరుమాళ్ల పల్లి బీటు, టీ.ఎన్ పాలెం సెక్షన్ ఎస్వీఎన్పీ డివిజన్ లో 2019లో పట్టుబడ్డారు.ఆ కేసును విచారించిన న్యాయమూర్తి జులై 31న నేరం రుజువు కావడంతో ఆ 10మందికి ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.6లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పువెలువరించారు.



# భారత సాయుధ దళాల శౌర్యపరాక్రమాలకు విజయోత్సవమే నిదర్శనం

న్యూఢిల్లీ, జులై 31:పహల్గామ్‌లో ఈ ఏడాది ఏప్రిల్ 22నాటి ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’పై లోక్‌సభలో ఈ రోజు ప్రత్యేక చర్చ సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. దీన్ని శక్తియుత, నిర్ణయాత్మక, విజయవంతమైన సైనికచర్యగా ఆయన అభివర్ణించారు. పార్లమెంటు సమావేశాలకు ముందు దీనిపై మీడియా సోదరులతో తన సంభాషణను ప్రధాని ముందుగా సభకు గుర్తుచేశారు. ప్రస్తుత సమావేశాలను భారత విజయోత్సవంగా, దేశ కీర్తిప్రతిష్ఠలకు నివాళిగా పరిగణించాలని గౌరవనీయ సభ్యులందరికీ విజ్ఞప్తి చేశానని పేర్కొన్నారు.

ఉగ్రవాద ప్రధాన కేంద్రాన్ని నేలమట్టం చేయడాన్ని ఈ ‘విజయోత్సవం’ సూచిస్తుందని శ్రీ మోదీ చెప్పారు. అలాగే నుదుటి సిందూరం సాక్షిగా చేసిన ప్రతిన నెరవేర్చడానికి ప్రతీకగానేగాక దేశం అంకితభావానికి, త్యాగానికి నివాళిగా నిలుస్తుందన్నారు. “ఈ విజయోత్సవం మన సాయుధ దళాల శౌర్యపరాక్రమాలకు నీరాజనం” అని ఆయన స్పష్టం చేశారు. ఈ విజయోత్సవం 140 కోట్ల మంది భారతీయుల ఐక్యత, సంకల్ప శక్తి, సమష్టి విజయానికి చిహ్నమని పేర్కొన్నారు.

ఈ విజయమిచ్చిన స్ఫూర్తితోనే సభ సమక్షాన భారత్ దృక్పథాన్ని దృఢంగా చాటుతున్నానని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఈ దృక్కోణాన్ని దర్శించలేని వారికి స్పష్టంగా అవగతం అయ్యేలా తాను అద్దం పడుతున్నానని చెప్పారు. దేశంలోని 140 కోట్ల మంది పౌరుల భావోద్వేగాలతో గళం కలపడానికే సభకు వచ్చానని ఆయన అన్నారు. ఈ సమష్టి భావన సభలో ప్రతిధ్వనించిందని, ఆ స్ఫూర్తికి తన స్వరం జోడించడానికే ఇప్పుడు ముందుకొచ్చానని శ్రీ మోదీ చెప్పారు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో తిరుగులేని మద్దతుతో ఆశీర్వదించిన దేశ ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, తాను సదా వారికి రుణపడి ఉంటానన్నారు. పౌరుల సమష్టి సంకల్పాన్ని ప్రశంసిస్తూ, ఈ విజయంలో వారు పోషించిన పాత్రకు ధన్యవాదాలు తెలిపారు.

పహల్గామ్‌లో 2025 ఏప్రిల్ 22నాటి అమానుష ఉగ్రదాడిని ప్రధానమంత్రి ఈ సందర్భంగా ఖండించారు. ఉగ్రవాదులు మతం గురించి వాకబు చేసి మరీ, అమాయకులను కాల్చి చంపారని గుర్తుచేశారు. దీన్ని క్రూరత్వానికి పరాకాష్ఠగా అభివర్ణిస్తూ, ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మత విద్వేషం రెచ్చగొట్టి, హింసాగ్ని రగల్చాలన్నదే వారి దురుద్దేశమని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, దేశ ప్రజానీకం ఏకతాటిపై నిలిచి, పునరుత్థాన శక్తితో ముష్కర కుట్రను భగ్నం చేశారంటూ కృతజ్ఞతలు తెలిపారు.

ఆ ఉదంతం తర్వాత ప్రపంచానికి భారత్ వైఖరిని స్పష్టం చేయడం కోసం ఆంగ్లంలో కూడా తాను బహిరంగ ప్రకటన చేశానని శ్రీ మోదీ గుర్తు చేసుకున్నారు. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలన్నది భారత్ దృఢ సంకల్పమని తాను స్పష్టం చేసినట్లు తెలిపారు. ఇంతటి క్రౌర్యానికి పాల్పడిన సూత్రధారులను వారు కలలోనైనా ఊహించని రీతిలో శిక్షిస్తామని కూడా ప్రకటించానని చెప్పారు. విదేశీ పర్యటనలో ఉన్న తాను ఏప్రిల్ 22న తక్షణ సమాచారంతో వెంటనే తిరిగి వచ్చి, ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేయడాన్ని గుర్తుచేశారు. ఉగ్రవాదంపై నిర్ణయాత్మక ప్రతిస్పందన దిశగా ఆ సమావేశంలో విస్పష్ట సూచనలిచ్చానని, తమ జాతీయ నిబద్ధతకు ఇదే నిదర్శనమని పునరుద్ఘాటించారు.

మన సాయుధ దళాల శక్తిసామర్థ్యాలు, సాహసంపై పూర్తి విశ్వాసం ప్రకటిస్తూ– ఆపరేషన్ సమయం, ప్రదేశం, ప్రతిస్పందన విధాన నిర్ణయాధికారం వంటి అంశాలపై సైన్యానికి సంపూర్ణ కార్యాచరణ స్వేచ్ఛ ఇచ్చినట్లు శ్రీ మోదీ తెలిపారు. ఉన్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలిచ్చామని, వాటిలో కొన్ని ప్రసార–ప్రచురణ మాధ్యమాల్లో కనిపించి ఉండవచ్చునని ప్రధానమంత్రి చెప్పారు. ఉగ్రవాదులకు విధించిన శిక్ష అత్యంత ప్రభావశీలం కావడంతో సూత్రధారులకు కంటిమీద కునుకు లేకుండా పోయిందని ఆయన సగర్వంగా వ్యాఖ్యానించారు.

భారత్ ప్రతిస్పందనను, తద్వారా సాయుధ దళాల విజయాన్ని సభ ద్వారా దేశం ముందుంచాలని భావించినట్లు ప్రధానమంత్రి పేర్కొన్నారు. పహల్గామ్ దాడి అనంతరం భారత్ తీవ్రస్థాయిలో సైనిక చర్యకు దిగుతుందని పాకిస్థాన్ అపోహ పడినట్లు చెప్పారు. అందుకే అణ్వస్త్ర ప్రయోగం చేస్తామంటూ బెదిరింపులకు దిగిందని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, తద్భిన్నంగా చేపట్టిన ఆపరేషన్‌లో తొలి కోణాన్ని స్పృశిస్తూ– ప్రణాళిక మేరకు 2025 మే 6, 7 తేదీల మధ్య అర్ధరాత్రి దాటాక దాడి చేయడంతో పాక్‌గ్భ్రాంతికి లోనైందని చెప్పారు. ఆ విధంగా ఏప్రిల్ 22నాటి ఉగ్రదాడికి మన సాయుధ దళాలు దీటుగా బదులివ్వడమేగాక నిర్దేశిత లక్ష్యాలను కేవలం 22 నిమిషాల్లో సాధించాయని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

అలాగే రెండో కోణాన్ని వివరిస్తూ– పాకిస్థాన్ గతంలోనూ భారత్‌తో పలుమార్లు కయ్యానికి పాల్పడిన నేపథ్యంలో శత్రువుకు అంతుబట్టని వ్యూహాన్ని అమలు చేశామని శ్రీ మోదీ తెలిపారు. ఈ మేరకు మునుపెన్నడూ స్పృశించని లక్ష్యాలను మన దళాలు సునాయాసంగా ఛేదించాయని తెలిపారు. ఈ మేరకు పాకిస్థాన్ వ్యాప్తంగాగల ఉగ్రవాద స్థావరాలను నిర్ణయాత్మక లక్ష్యం చేసుకుని దెబ్బతీశాయన్నారు. వీటిలో భారత్ చేరుకోగలదని ఎవరూ ఊహించని ప్రాంతాలు కూడా ఉన్నాయని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా బహావల్పూర్, మురిద్కే ఉగ్రవాద స్థావరాలను ప్రత్యేకించి ప్రస్తావించారు. ఈ రెండు కీలక ప్రదేశాలను నేలమట్టం చేయడం ద్వారా ఉగ్రవాద మూకలను భారత సాయుధ దళాలు విజయవంతంగా హతమార్చాయని ప్రకటించారు.

అణ్వస్త్ర ప్రయోగం చేస్తామంటూ పాకిస్థాన్ బెదిరింపులకు పాల్పడినా, అవన్నీ ఉత్తుత్తివేనని తేలిపోవడం మూడో కోణమని శ్రీ మోదీ చెప్పారు. ఇలాంటి అణు బెదిరింపులకు భారత్ బెదిరేది లేదని, ప్రత్యర్థి ఎదుట ఎన్నడూ మోకరిల్లబోదని ఈ ఆపరేషన్ నిరూపించినట్లు పేర్కొన్నారు.

ఆపరేషన్ సిందూర్ కింద భారత్ వ్యూహాత్మక ప్రతిస్పందనలోని నాలుగో కోణాన్ని ప్రస్తావిస్తూ, పాక్ భూభాగంలోకి లోతుగా దూసుకుపోయి, కచ్చితమైన దాడుల ద్వారా తన అధునాతన సాంకేతిక సామర్థ్యాలను ప్రదర్శించిందని తెలిపారు. దీంతో పాకిస్థాన్ వైమానిక స్థావరాలు భారీగా నష్టపోయాయని, ఇప్పటికీ కోలుకునే స్థితిలో లేవన్నారు. మనమిప్పుడు సాంకేతిక పరిజ్ఞానాధారిత యుద్ధశకంలో ఉన్నామని, ఈ రంగంలో భారత్ తన నైపుణ్యాన్ని ఆపరేషన్ సిందూర్ ద్వారా రుజువు చేసుకున్నదని ఆయన వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో నిత్య సంసిద్ధత దిశగా భారత్ కృషి చేయకపోయి ఉంటే– నేటి సాంకేతిక శరంలె దేశం అపార కష్టనష్టాలకు లోనయ్యేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శ్రీ మోదీ ఐదో కోణాన్ని ప్రస్తావిస్తూ– స్వయం సమృద్ధ భారత్ శక్తిసామర్థ్యాలను ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచం తొలిసారి గ్రహించిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. పాక్ ఆయుధ వ్యవస్థల దుర్బలత్వాన్ని బహిర్గతం చేసిన ‘మేడ్ ఇన్ ఇండియా’ డ్రోన్లు, క్షిపణుల ప్రభావాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

భారత రక్షణరంగ స్వరూపంలో ఓ కీలక అంశాన్ని ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఈ మేరకు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) ప్రకటనను ప్రస్తావిస్తూ– ఆపరేషన్ సిందూర్‌లో సైనిక, నావిక, వైమానిక దళాలు సమష్టిగా వ్యవహరించాయని, త్రివిధ బలగాల సమన్వయ శక్తి పాక్ మూలాలను కుదిపేసిందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

దేశంలో ఇంతకుముందు జరిగిన ఉగ్రవాద దాడుల సూత్రధారులకు శిక్ష పడుతుందన్న భయం, సంకోచాలు ఏ కోశానా ఉండేవి కావని ప్రధానమంత్రి పేర్కొన్నారు. దీంతో మళ్లీమళ్లీ దాడులకు ప్రణాళికలు రచిస్తూనే వచ్చారని శ్రీ మోదీ చెప్పారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారాయని వారికి స్పష్టంగా అర్థమైందన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఏ దాడికి పాల్పడినా వారికి కంటిమీద కునుకు ఉండటం లేదని చెప్పారు. భారత్ ప్రతిదాడికి దిగుతుందని, ఉగ్రమూకలను అమిత కచ్చితత్వంతో దునుమాడగలదని తెలిసివచ్చినట్లు పేర్కొన్నారు. భారత్ దీన్నొక “నవ్య సంప్రదాయం”గా మార్చిందని ప్రధానమంత్రి ప్రకటించారు.

అంతర్జాతీయ సమాజం ఇప్పుడు భారత్ వ్యూహాత్మక కార్యకలాపాల విస్తృత పరిధి, పరిమాణాలను గుర్తించిందని తెలిపారు. ‘సిందూర్ నుంచి సింధు’ వరకూ పాక్ అంతటా దాడులతో ఆపరేషన్ సిందూర్ ఒక కొత్త సిద్ధాంతానికి శ్రీకారం చుట్టిందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. భారత్‌పై ఎలాంటి దుశ్చర్యకు పాల్పడినా, ఉగ్రదాడి చేయించినా, సూత్రధారులతోపాటు తాను కూడా భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని పాకిస్థాన్‌కు తెలిసివచ్చిందన్నారు.

ఆపరేషన్ సిందూర్ ద్వారా రూపుదిద్దుకున్న మూడు విస్పష్ట సూత్రాలను ప్రధానమంత్రి వివరించారు. ఇందులో మొదటిది... స్వీయ నిర్దేశానుగుణంగా, తనదైన శైలిలో, తనకు అనువైన సమయంలో దీటుగా ప్రతిస్పందిస్తుంది. రెండోది... అణ్వస్త్ర దాడులకు పాల్పడతామనే ఉత్తుత్తి బెదిరింపులను ఇకపై సహించదు. మూడోది... ఉగ్రవాద ప్రోత్సాహకులు, దాడుల సూత్రధారులను ఒకేవిధంగా పరిగణిస్తుంది.

ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత్‌కు ప్రపంచవ్యాప్త మద్దతు లభించడంపై శ్రీ మోదీ సభకు స్పష్టత ఇచ్చారు. జాతీయ భద్రత పరిరక్షణ దిశగా భారత్ సముచిత చర్యలు చేపట్టడాన్ని ఏ దేశమూ వ్యతిరేకించలేదని ఆయన పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితిలోని 193 సభ్య దేశాలలో కేవలం మూడు మాత్రమే పాకిస్థాన్‌కు మద్దతు పలికాయని ప్రధానమంత్రి గుర్తుచేశారు. అంటే– ప్రపంచంలోని దాదావు అన్ని దేశాలూ విస్తృత మద్దతునిచ్చినట్లేనని ఆయన వ్యాఖ్యానించారు. ఇక “క్వాడ్, బ్రిక్స్” వంటి వ్యూహాత్మక కూటములు సహా ఫ్రాన్స్, రష్యా, జర్మనీ వంటి అగ్ర దేశాలు కూడా మద్దతు ప్రకటించాయని తెలిపారు. మొత్తంమీద అంతర్జాతీయ సమాజం భారత్‌కు అన్నివిధాలా అండగా నిలిచిందని ప్రధానమంత్రి వెల్లడించారు.

భారత్ కు ప్రపంచ దేశాల నుంచి మద్దతు లభించినప్పటికీ, దేశ సైనికుల ధైర్యసాహసాలకు ప్రతిపక్షాల నుంచి మద్దతు లభించలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన శ్రీ మోదీ, ఏప్రిల్ 22న ఉగ్రవాద దాడి జరిగిన కొద్ది రోజులకే కొందరు ప్రతిపక్ష నేతలు ప్రభుత్వాన్ని ఎగతాళి చేయడం ప్రారంభించారని, విఫలమైనట్టు ఆరోపించారని పేర్కొన్నారు. ఈ వెటకారం, పహల్గామ్ హత్యాకాండ అనంతరం కూడా వారు రాజకీయ అవకాశవాదానికి పాల్పడడం దేశవ్యాప్త విషాదాన్ని వారు తేలికగా తీసుకున్నట్టు కనిపించిందని ప్రధాన మంత్రి అన్నారు. వారి ప్రకటనలు చిల్లరగా ఉండడమే కాకుండా భారత భద్రతా దళాల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కొంతమంది ప్రతిపక్ష నాయకులు దేశ శక్తి మీద, మన సాయుధ దళాల సామర్థ్యాలపైన నమ్మకం లేకుండా, ఆపరేషన్ సిందూర్ పై ఇంకా అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారని శ్రీ మోదీ అన్నారు. పత్రికలలో పతాక శీర్షికల కోసం వెంపర్లాడడం రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగపడవచ్చునేమో కానీ అది ప్రజల నమ్మకాన్ని లేదా గౌరవాన్ని పొందదని ఆయన స్పష్టం చేశారు.

2025 మే 10 న భారతదేశం ఆపరేషన్ సిందూర్ కింద కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ ప్రకటన వివిధ ఊహాగానాలకు దారితీసిందని, ఇది సరిహద్దు వెంబడి పుట్టుకొచ్చిన ప్రచారంగా ఆయన అభివర్ణించారు.

భారత సైనిక బలగాలు చూపిన వాస్తవాలను విశ్వసించకుండా, పాకిస్థాన్ వ్యాప్తి చేస్తున్న తప్పుడు కథనాలను పదేపదే ప్రచారం చేస్తున్నవారిని ఆయన తీవ్రంగా విమర్శించారు. భారత్ ఎప్పుడూ దృఢమైన, స్పష్టమైన వైఖరినే కొనసాగిస్తూ వచ్చిందని ఆయన పునరుద్ఘాటించారు.

గతంలో భారతదేశం నిర్వహించిన లక్ష్య నిర్దేశిత సైనిక చర్యలను ప్రస్తావిస్తూ, వాటిలో చూపిన వ్యూహాత్మక స్పష్టత, అమలు తీరును ప్రధాని ప్రముఖంగా పేర్కొన్నారు. సర్జికల్ దాడుల సమయంలో భారతదేశం శత్రు దేశ భూభాగంలోని ఉగ్రవాదుల లాంచ్ ప్యాడ్లను ధ్వంసం చేసే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని సూర్యోదయానికి ముందే విజయవంతంగా పూర్తి చేసిందని తెలిపారు. బాలాకోట్ వైమానిక దాడుల్లో ఉగ్రవాద శిక్షణా కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని భారత్ ఈ మిషన్ ను విజయవంతంగా పూర్తి చేసిందని అన్నారు. ఆపరేషన్ సిందూర్ కింద, భారతదేశం మళ్ళీ స్పష్టమైన లక్ష్యంతో పనిచేసిందని, పహల్గామ్ దాడులకు పాల్పడిన ఉగ్రవాదుల ప్రధాన కేంద్రాన్ని, వారి ప్రణాళిక స్థావరాలు, శిక్షణ కేంద్రాలు, నిధుల మూలాలు, ట్రాకింగ్, సాంకేతిక మద్దతు, ఆయుధ సరఫరా సహా మొత్తం మౌలిక సదుపాయాల వ్యవస్థలను ధ్వంసం చేయడం ప్రధాన లక్ష్యంగా ఈ ఆపరేషన్ జరిగిందని వివరించారు. ''భారతదేశం చాలా కచ్చితంగా ఉగ్రవాదుల నాడి కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని వారి కార్యకలాపాల మూలాన్ని నిర్వీర్యం చేసింది” అని ప్రధానమంత్రి అన్నారు.

”భారత దళాలు మరోసారి తమ లక్ష్యాలను 100% సాధించాయి, దేశ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించాయి” అని శ్రీ మోదీ స్పష్టం చేశారు. ఈ మైలురాళ్లను ఉద్దేశపూర్వకంగా విస్మరించేవారిని విమర్శిస్తూ, వారిని దేశం బాగా గుర్తుంచుకుంటుందని వ్యాఖ్యానించారు. మే 6 రాత్రి, మే 7 ఉదయం ఈ ఆపరేషన్ జరిగింది. మే 7 న సూర్యోదయం తరువాత భారత సైన్యం పత్రికా ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేసి మిషన్ పూర్తయినట్టు ప్రకటించిందని తెలిపారు. ఉగ్రవాద వ్యవస్థలను, వాటి సూత్రధారులను, వాటికి ఆయుధాలు, ఇతర అవసరాల చేరవేత మార్గాలను ధ్వంసం చేయాలనే భారతదేశ లక్ష్యాలు మొదటి రోజు నుంచే స్పష్టంగా ఉన్నాయని, ప్రణాళికాబద్ధంగా ఈ మిషన్ పూర్తయిందని ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు. కేంద్ర రక్షణ మంత్రి శ్రీ రాజ్ నాథ్ సింగ్ ను ఉటంకిస్తూ, భారత సాయుధ దళాలు తమ విజయాన్ని నిమిషాల్లోనే పాకిస్థాన్ సైన్యానికి తెలియజేశాయని, తద్వారా భారత ఉద్దేశాలు, ఫలితాలు స్పష్టంగా అర్థమయ్యేలా చేశాయని ప్రధానమంత్రి దృఢంగా పేర్కొన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదులకు బహిరంగంగా మద్దతు ఇవ్వడం వారి అవివేకాన్ని చూపుతోందని ఆయన పేర్కొన్నారు. వారు తెలివిగా వ్యవహరిస్తే, ఇంత ధైర్యంగా ఈ తప్పుడు నిర్ణయం తీసుకునేవారు కాదని చెప్పారు. భారత్ పూర్తిగా సిద్ధంగా ఉండి, సరైన సమయం కోసం ఎదురు చూసిందని, భారత్ పోరాటం ఒక దేశంతో కాదని, ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించడమే విధానమని ప్రధానమంత్రి స్పష్టంగా పేర్కొన్నారు. అయితే ఉగ్రవాదులకు మద్దతుగా యుద్ధరంగంలోకి ప్రవేశించాలని పాకిస్థాన్ నిర్ణయించడంతో భారత్ దీటుగా బదులిచ్చిందని చెప్పారు. మే 9 అర్ధరాత్రి నుంచి 10వ తేదీ ఉదయం వరకు భారత క్షిపణులు పాక్ ఊహకు అందనంత తీవ్రతతో వారి లక్ష్యాలపై దాడి చేశాయని ప్రధాని తెలిపారు.

ఆపరేషన్ సిందూర్ కింద భారత్ తీసుకున్న నిర్ణయాత్మక చర్య పాకిస్థాన్‌ను మోకరిల్లేలా చేసిందని ప్రధాని సభకు తెలిపారు. భారత్ చర్యకు ఆ దేశ ప్రజలు విస్తుపోయిన తీరు, వారి స్పందనలు టెలివిజన్లలో విస్తృతంగా కనిపించాయని ఆయన గుర్తు చేశారు. భారత్ స్పందనకు పాక్ ఎంతగా ఉక్కిరిబిక్కిరి అయిందంటే, దాని డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డిజీఎంఓ) నేరుగా భారతదేశానికి ఫోన్ చేసి, దాడిని ఆపమని వేడుకున్నారని, ఇక దాడులను తాము తట్టుకోలేమని ఆయన అంగీకరించారని శ్రీ మోదీ తెలిపారు.

మే 7వ తేదీ ఉదయం జరిగిన విలేకరుల సమావేశంలో భారత్ తన లక్ష్యాలను సాధించిందని, పాక్ మరింత రెచ్చగొడితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సివస్తుందని స్పష్టం చేసిందని ఆయన పునరుద్ఘాటించారు. “భారత్ విధానం సరైన ఉద్దేశంతో, సక్రమమైన ఆలోచనతో, సాయుధ దళాల సమన్వయంతో రూపుదిద్దుకుంది. ఇది ఉగ్రవాదాన్ని, దాని నిర్వాహకులను, వారి స్థావరాలను నిర్మూలించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. భారత్ చర్య ఉద్దేశం ఉద్రిక్తతలను పెంచడం ఎంతమాత్రం కాదు” అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

భారత్ చర్యపై ఏ ప్రపంచ నాయకుడూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని ప్రధాని పేర్కొన్నారు. మే 9వ తేదీ రాత్రి భారత రక్షణ శాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమావేశంలో ఉన్న సమయంలో అమెరికా ఉపాధ్యక్షుడు పలుమార్లు తనతో ఫోన్‌లో మాట్లాడేందుకు ప్రయత్నించారని ఆయన వెల్లడించారు. సమావేశం అనంతరం తిరిగి కాల్ చేసినప్పుడు, పాక్ పెద్ద స్థాయిలో ఎదురుదాడి ప్రారంభించవచ్చన్న సమాచారం అందినట్టు ప్రధాన మంత్రి తెలిపారు. దీనిపై తాను స్పందిస్తూ.. ‘పాక్ ఉద్దేశం అదే అయితే, వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని, భారత్ మరింత బలంగా ప్రతీకారం తీర్చుకుంటుందని, తూటాలకు ఫిరంగులతో సమాధానం చెబుతామని” స్పష్టం చేసినట్టు తెలిపారు. మే 9వ తేదీ రాత్రి, మే 10వ తేదీ ఉదయం భారతదేశం శక్తిమంతంగా తిరిగి దాడి చేసి, పాక్ సైనిక మౌలిక సదుపాయాలను భారీ బలప్రయోగంతో ధ్వంసం చేసిందని ప్రధాని తెలిపారు. ఇక భారత్ నుంచి ప్రతి ప్రతిస్పందన మునుపటి కంటే బలంగా ఉంటుందని పాకిస్థానీలకు ఈపాటికి పూర్తిగా అర్థమై ఉంటుందని ఆయన పేర్కొన్నారు. “పాకిస్థాన్ మళ్లీ ఏదైనా దుస్సాహసం చేస్తే అది తగిన, భయంకరమైన ప్రతీకారాన్ని ఎదుర్కొంటుంది. ఆపరేషన్ సిందూర్ ఇప్పటికీ చురుకుగా, దృఢంగా కొనసాగుతోంది” అని శ్రీ మోదీ ప్రకటించారు.

”నేటి భారతదేశం ఆత్మవిశ్వాసంతో నిండి ఉంది స్వావలంబన స్ఫూర్తితో వేగంగా పురోగమిస్తోంది” అని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు, ఆత్మనిర్భరత దిశగా భారతదేశం ప్రయాణాన్ని ప్రజలు చూస్తున్నారు. అయితే ఇదే సమయంలో, విపక్షాలు తమ రాజకీయ విమర్శల కోసం పాకిస్థాన్ పై ఎక్కువగా ఆధారపడుతున్న దురదృష్టకరమైన ధోరణిని కూడా దేశం చూస్తోంది” అని ప్రధాని అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న 16 గంటల చర్చలో కూడా, విపక్షాలు పాక్ నుంచి సమస్యలను దిగుమతి చేసుకుంటున్న తీరు స్పష్టంగా కనిపించిందని, ఇది చాలా విచారకరమైన విషయమని ప్రధాని పేర్కొన్నారు.

యుద్ధాల స్వరూపం మారిపోతున్న నేపథ్యంలో అవాస్తవ సమాచారం, కల్పిత కథనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రధాన మంత్రి అన్నారు.

భారత సైనిక దళాల మనోబలాన్ని దెబ్బతీయడానికి, ప్రజల్లో అవిశ్వాసం కలిగించడానికి కృత్రిమ మేధ ఆధారిత తప్పుడు ప్రచారాలను చేస్తున్నారని హెచ్చరించారు. ప్రతిపక్షాలు, దాని మిత్రపక్షాలు పాక్ ప్రచారానికి ప్రతినిధులుగా మారి భారత జాతీయ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

భారతదేశ సైనిక విజయాలను ప్రశ్నించడానికి, తక్కువ చేయడానికి పదేపదే జరుగుతున్న ప్రయత్నాలను ప్రస్తావిస్తూ, విజయవంతమైన సర్జికల్ దాడుల తరువాత, ప్రతిపక్ష నాయకులు సాయుధ దళాల నుంచి ఆధారాలు డిమాండ్ చేసిన విషయాన్ని శ్రీ మోదీ గుర్తు చేశారు.

అయితే ప్రజల మనోభావాలు సైన్యానికి అనుకూలంగా ఉండటంతో ప్రతిపక్ష నేతలు గళం మార్చి మూడు నుంచి పదిహేను వరకు భిన్నమైన సంఖ్యలను ఉటంకిస్తూ తాము కూడా సర్జికల్ దాడులు నిర్వహించినట్టు చెప్పుకున్నారని ప్రధాని పేర్కొన్నారు.

బాలాకోట్ విమాన దాడుల అనంతరం, విపక్షాలు ఆ ఆపరేషన్‌ను నేరుగా వ్యతిరేకించలేకపోయినా, ఫోటో ఆధారాలు ఇవ్వాలని డిమాండ్ చేయడం ప్రారంభించాయని ప్రధాన మంత్రి తెలిపారు. దాడి ఎక్కడ జరిగింది ఏం ధ్వంసమయ్యింది ఎంతమంది మృతిచెందారువంటి ప్రశ్నలను వారు పదే పదే అడిగారని, ఇవన్నీ పాక్ మాటల చాతుర్యాన్ని ప్రతిబింబించాయని ఆయన వ్యాఖ్యానించారు.

భారత వైమానిక దళం పైలట్ అభినందన్ ను పాకిస్థాన్ బంధించినప్పుడు ఆ దేశంలో సంబరాలు జరగడం సహజమే అనీ, అయితే భారత్‌లో కొందరు నిస్సిగ్గుగా అనుమానాలు వ్యక్తపరిచి ప్రధాన మంత్రి సంకటంలో ఉన్నారని, అభినందన్ తిరిగి రాకపోవచ్చని చర్చ జరిపారని ఆయన అన్నారు. అభినందన్ భారత్‌కు తిరిగి రావడం సాహసోపేత సంకల్పంతోనే సాధ్యమైందని, ఆయన స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత విమర్శకుల ఒతా ఒక్కసారిగా మౌనం వహించారని ప్రధాని వ్యాఖ్యానించారు.

పహల్గామ్ దాడి తర్వాత ఒక బీఎస్ఎఫ్ జవానును పాకిస్థాన్ బందీగా తీసుకున్నప్పుడు, ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి తమకు పెద్ద అవకాశం లభించినట్లు కొన్ని వర్గాలు భావించాయని శ్రీ మోదీ పేర్కొన్నారు. సైనికుని భవితవ్యం, అతడి కుటుంబ పరిస్థితి, అతడు తిరిగి వచ్చే అవకాశం గురించి ఊహాజనిత ప్రశ్నలను లేవనెత్తుతూ సామాజిక మాధ్యమాల్లో అనేక కథనాలను వ్యాప్తి చేశారని విమర్శించారు. అయితే ఈ ప్రచారానికి భారత్ స్పష్టతతో హుందాగా స్పందించిందని, తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ, ప్రతి సైనికుడిని రక్షించే తన నిబద్ధతను పునరుద్ఘాటించిందని ఆయన స్పష్టం చేశారు.

పహల్గామ్ ఘటన తర్వాత పట్టుబడిన బీఎస్ఎఫ్ జవాను కూడా గౌరవంగా, హుందాగా తిరిగివచ్చారని ప్రధానమంత్రి తెలిపారు. ఇందుకు ఉగ్రవాదులు, వారిని నడిపించే శక్తులతో పాటు వారిని చూసి భారత్ లోని కొందరు వ్యక్తులు కూడా బాధపడినట్టు కనిపిస్తోందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. సర్జికల్ దాడుల సమయంలో కూడా రాజకీయ లాభాల కోసం కొన్ని ఆటలు ఆడే ప్రయత్నాలు జరిగాయని, కానీ అవి ప్రజల్లో ఎటువంటి ఆదరణ పొందలేక విఫలమయ్యాయని అన్నారు. వైమానిక దాడుల సమయంలో కూడా ఇలాంటి ప్రయత్నాలు జరిగాయి కానీ అవి కూడా విఫలమయ్యాయని అన్నారు. ఆపరేషన్ సిందూర్ జరిగినప్పుడు విమర్శకులు తమ వైఖరిని మార్చుకున్నారని, మొదట ఆపరేషన్ ను అంగీకరించడానికి నిరాకరించారని, ఆ తర్వాత ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారని వ్యతిరేకించే వారు ఎప్పుడూ అభ్యంతరం చెప్పడానికి ఒక సాకు వెతుక్కుంటారని ఆయన వ్యాఖ్యానించారు.

సాయుధ దళాల పట్ల ప్రతిపక్షాలు చాలాకాలంగా ప్రతికూల వైఖరిని ప్రదర్శిస్తున్నాయని, ఇటీవల కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కూడా ప్రతిపక్షాలు విజయాన్ని జరుపుకోలేదని, దాని ప్రాముఖ్యతను గుర్తించలేదని ప్రధాని గుర్తు చేశారు. డోక్లాం ప్రతిష్టంభన సమయంలో భారత బలగాలు ధైర్యసాహసాలు ప్రదర్శిస్తుంటే ప్రతిపక్ష నేతలు రహస్యంగా అనుమానాస్పద వర్గాల నుంచి వివరణలు కోరారనడానికీ చరిత్రే సాక్ష్యమని ఆయన వ్యాఖ్యానించారు.

పాకిస్థాన్ కు ప్రతిపక్షాలు క్లీన్ చిట్ ఇచ్చినట్లు కనిపించడంపై ప్రధాని విస్మయం వ్యక్తం చేశారు. పహల్గామ్ ఉగ్రవాదులు పాక్ జాతీయులని రుజువు చేయాలంటూ ప్రతిపక్షాలు లేవనెత్తిన డిమాండ్ ను ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంలో పాకిస్థాన్ కూడా ఇదే డిమాండ్ చేయడం గమనార్హమని వ్యాఖ్యానించారు. ఇలాంటి అలవాట్లు, అలాంటి ధైర్యంతో బాహ్య శక్తుల కథనాలను ప్రతిధ్వనించే ప్రవర్తన విపక్షాల్లో ఇప్పటికీ కొనసాగుతోందని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. ఈరోజు ప్రజల ముందు స్పష్టమైన సాక్ష్యాలు, వాస్తవాలు ఉన్నాయి. అయినప్పటికీ, కొందరు వ్యక్తులు ఇంకా అనుమానాలు వ్యక్తపరచడం ఆగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత స్పష్టమైన ఆధారాలు లభించకపోతే ఈ వ్యక్తులు ఇంకా ఎలా స్పందించేవారోనని, అప్పుడు వారి ప్రతిస్పందనలు మరింత తప్పుదోవ పట్టించేవిగా లేదా బాధ్యతారాహిత్యంగా ఉండేవని ఆయన అన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన ఒక కోణంపైనే చర్చలు ఎక్కువగా దృష్టి సారించినప్పటికీ దేశ గౌరవం, బల ప్రదర్శనల ప్రాధాన్యతను తెలిపే క్షణాలు కూడా ఉన్నాయని ప్రధాని అన్నారు. భారత వైమానిక రక్షణ వ్యవస్థలను ప్రశంసించిన ఆయన.. ఈ వ్యవస్థలు ప్రపంచవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. ఇవి పాకిస్థాన్ క్షిపణులను, డ్రోన్‌లను గడ్డిపరకలుగా కూల్చేశాయని అన్నారు.

# అంతర్జాతీయ సైబర్ ముఠా అరెస్టు !

## 200 సిమ్‌లు, పరికరాల స్వాధీనం



ఆదిలాబాద్, జులై 31:మంచిర్యాల జిల్లాలో రామగుండం పోలీసులు సైబర్ ఫైనాన్షియల్ మోసాల ముఠాను ఛేధించి, అంతర్జాతీయ స్థాయిలో నేరాలకు పాల్పడుతున్న నలుగురు సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై వివరాలు వెల్లడించిన డీసీపీ ఎగ్గిడి భాస్కర్ మాట్లాడుతూ టెలికమ్యూనికేషన్ విభాగం సహకారంతో జన్నారం మండలంలో సుస్థిరమైన సమాచారంతో ఈ ఆపరేషన్ నిర్వహించామని తెలిపారు.

వోడాఫోన్ టవర్ పరిసరాల్లో అనుమానాస్పద సిమ్ కార్డుల వాడకాన్ని గుర్తించి విచారణ చేపట్టిన పోలీసులు, మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన యాండ్రాపు కామేష్, జగిత్యాల జిల్లాకు చెందిన బాపయ్య యాదవ్, మధుకర్ యాదవ్, మంచిర్యాల జిల్లాకు చెందిన గోట్ల రాజేష్ యాదవ్‌లను అరెస్ట్ చేశారు.

ఈ నిందితులు గతంలో కాంబోడియాలో పనిచేసి, అక్కడి నుంచి భారతదేశంలోకి సైబర్ మోసాలకు అవసరమైన పరికరాలు, ఫేక్ సిమ్‌లు, ల్యాప్‌టాప్‌లు తదితరాలను దిగుమతి చేసుకుని, ప్రత్యేకంగా అద్దె ఇంట్లో ఫ్రాడ్ సెటప్ ఏర్పాటుచేశారు. మొత్తం 262 ఆధారాలు లేని సిమ్ కార్డులతో పాటు 72 జియో, 79 ఎయిర్‌టెల్, 111 వోడాఫోన్ సిమ్‌లు, ఫైబర్ నెట్, డీలింక్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఆపరేషన్‌ను మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, రామగుండం సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటరమణ రెడ్డి, లక్షెటిపేట సీఐ రమణమూర్తి, ఇన్స్పెక్టర్లు కృష్ణమూర్తి, శ్రీనివాస్, జన్నారం ఎస్సై అనూష, లక్షెటిపేట ఎస్సై సురేష్, దండేపల్లి ఎస్సై తహసోద్దీన్ తదితరులు సమర్థవంతంగా నిర్వహించారు. డీసీపీ భాస్కర్ వీరందరినీ ప్రత్యేకంగా అభినందించారు.

# నిరుపేదలకు ఆపన్న హస్తం అందించాలి : కె.వి.ప్రసాద్



నల్గొండ, జులై 31: నిరుపేదలకు ఆపన్న హస్తం అందించేందుకు లయన్స్ క్లబ్ ఎల్లవేళలా ముందుండాలని వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్–1 కె.వి ప్రసాద్ అన్నారు. నిడమనూరు మండలంలోని శాఖాపురం సాయి ఫంక్షన్ హాల్‌లో గురువారం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాల ద్వారా చేయూతనందించడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ముందుకు సాగాలన్నారు.


అనంతరం లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు బెలిదె అశోక్, కార్యదర్శి చిత్రం అశోక్, కోశాధికారి వంకా బ్రాహ్మన్న, వైస్ చైర్మన్ గండికోట యాదగిరితో పాటు సభ్యుల చేత వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ 2 కోడె సతీశ్ కుమార్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పూర్వ చైర్మన్లు చేకూరి హనుమంతరావు, పోలె డేవిడ్, పాంపాటి శ్రీనివాసులు, అంకతి సత్యం, ఉన్నం చిన్న వీరయ్య, నేతాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం : అంకతి సత్యం

నల్గొండ, జులై 31:కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదల సొంతింటి కల సాకారం అవుతుందని నిడమనూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు.

మండల పరిధిలోని సూరేపల్లి గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులకు కాంగ్రెస్ నాయకుడు పసుపులేటి సైదయ్య నాయుడుతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముంగి శివ మారయ్య, కొండ శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగ్ విజయ్ కుమార్, సంకూరి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి కందుల సత్యనారాయణ, మార్కెట్ డైరెక్టర్ మెండె వెంకటేశ్వర్లు, సంకూరి జానకిరాములు పాల్గొన్నారు.

# బొజ్జయ్య కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి : మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి



మహబూబ్‌నగర్, జులై 31:: మహబూబ్ నగర్ జిల్లా మూసపేట మండలం నిజాలాపూర్‌లో బుధవారం 108 అంబులెన్సు లో ఆక్సిజన్ అందక మృతి చెందిన బొజ్జయ్య కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కోరారు . బొజ్జయ్య మృతదేహానికి గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రభుత్వం నిర్లక్ష్యానికి ఒక నిండు ప్రాణం బలైందని, కుటుంబం రోడ్డున పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యులైన వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో బొజ్జయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. జిల్లాకు ఇన్‌చార్జి గా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఉన్నప్పటికీ వైద్య రంగం పరిస్థితి దారుణంగా ఉండడం శోచనీయమని అన్నారు. అత్యవసర సమయాల్లో 108 కి ఫోన్ చేస్తే ఆదుకోవాల్సింది పోయి అసౌకర్యాలతో రోగులను ప్రాణాల మీదకు తేవడం విచారకమరమని అన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలి : డిప్యూటీ డీఎంహెచ్‌వో

తాండూర్, జులై 31: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలలో ముందస్తుగా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి సుధాకర్ నాయక్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసు కున్నారు.

ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సమర్థవంతమైన పర్యవేక్షణ, నియమిత వైద్య సేవలు, ప్రబల జ్వరాల నివారణకు నిబద్ధతతో బాధ్యతలను నిర్వర్తించాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అవగాహన పెంచేందుకు క్యాంపులు నిర్వహించాలని, సీజనల్ వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం రోగులకు సంబంధించిన రిజిస్టర్స్, ల్యాబ్, వార్డులు, మెడిసిన్ స్టాక్, శానిటేషన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రఖాన్సీరాణి , సీహెచ్ వోలు జయమేరి, మోటేశ్వర్లు, సూపర్ వైజర్లు రమాదేవి, తార, ల్యాబ్ టెక్నీషన్ హకీమ్, సిబ్బంది దౌలత్, నర్సింగ్ ఆఫీసర్ జయలక్ష్మి ఉన్నారు .

# ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడాలి : దండి సురేశ్




ఖమ్మం, జులై 31:ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ కార్యకర్తలు, నాయకులు ముందుండి పోరాడాలని ఆ పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేశ్ అన్నారు. గురువారం బోనకల్లు మండలంలోని రాపల్లె గ్రామంలో ఏనుగు రామకృష్ణ అధ్యక్షతన పార్టీ మండల సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరుగనున్న నేపథ్యంలో గ్రామాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులతో పాటు అధికారులు సైతం పర్యటించి హడావుడి చేస్తారన్నారు. ఇదే సమయంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధ్యయనం చేసి వారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు సీపీఐ శ్రేణులు కృషి చేయాలన్నారు. దశాబ్దాల కాలంగా పరిష్కారం కాని సమస్యలను, ఆర్థికేతర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సాధించాలన్నారు. రేషన్ కార్డులు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, ఇతర ప్రజా సమస్యలు, నూతనంగా దరఖాస్తు పెట్టుకునే వారికి అండగా నిలిచి అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. గ్రామ గ్రామాన సర్వేలు నిర్వహించి సమస్యలను స్పష్టంగా తెలుసుకుని అధికారులకు వివరించే ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ కార్యకర్తలకు, సానుభూతి పరులకు పార్టీ నుండి చేయాల్సిన సహాయంలో వెనకడుగు వేయొద్దని పేర్కొన్నారు.

**రైతాంగం పరిష్కరించాలి : జమ్ముల జితేందర్ రెడ్డి**
పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి

జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. విత్తనాలు, యూరియా, డీఏపీ, ఇతర ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. రాపల్లి, బ్రాహ్మణపల్లి, పాలడుగు గ్రామాలకు వచ్చే వైరా రిజర్వాయర్‌కు సంబంధించిన 26, 28 కాల్వలకు సకాలంలో నీరు అందించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏనుగు వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, బెజవాడ రవిబాబు, ఏనుగు గాంధీ, ఎంఏ రహీం, జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్, బత్తినేని నీరజ, సీపీఐ బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, మండల కార్యవర్గ సభ్యులు ఆకన పవన్, మరీదు ఈశ్వరమ్మ, పారుపల్లి నరసింహారావు, ఏలూరు రమేశ్, ముడువల్లి వెంకటేశ్వర్లు, కొంగర కృష్ణయ్య, వయంగల పెద్ద రమేశ్, ఏలూరి పూర్ణచందర్‌రావు, ఏనుగు రవి, బొమ్మినేని కొండలరావు, కొంగర భాస్కర్ రావు, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, తోటపల్లి ఆనందరావు, గుంపుల జయరాజ్ పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ భారత్ వయోవందన కార్డులపై తాజా సమాచారం

న్యూఢిల్లీ, జులై 31:2024 అక్టోబరు 29న కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ – ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (ఏబీ–పీఎంజేఏవై) పరిధిని విస్తరించి 70 ఏళు నిండిన వయో వృద్ధులందరినీ వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులతో నిమిత్తం లేకుండా ఈ పథకం పరిధిలో చేర్చింది. ఈ పథకం కింద లబ్ధిదారులు ఆయుష్మాన్ వయో వందన కార్డుల ద్వారా ఏటా రూ. 5 లక్షల వరకు ఉచిత చికిత్స ప్రయోజనాలను పొందుతారు.

వయో వందన పరిధిలో ఉన్న అర్హులైన లబ్ధిదారులు.. తమ నివాస ప్రాంతంతో నిమిత్తం లేకుండా దేశవ్యాప్తంగా ఈ పథకం జాబితాలో ఉన్న 31,466 హాస్పిటళ్లలో ఎందులో అయినా ఉచితంగా ఆరోగ్య సేవలను పొందగల సౌలభ్యాన్ని కూడా ఏబీ–పీఎంజేఏవై అందిస్తుంది. ఇది దేశవ్యాప్తంగా వృద్ధులందరికీ ఎలాంటి అంతరాయమూ లేకుండా, సమానంగా నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలు అందేలా భరోసానిస్తుంది.

వయో వందన లబ్ధిదారులు ఈ పథకం పరిధిలో ఉన్న 14,194 ప్రైవేటు హాస్పిటళ్ల నుంచి కూడా చికిత్స పొందవచ్చు. నిరంతరం నాణ్యమైన సేవలను అందించడం లక్ష్యంగా.. ఆయుష్మాన్ భారత్– ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (ఏబీ–పీఎంజేఏవై) పరిధిలో హాస్పిటళ్లను చేర్చడం కోసం సమగ్ర ఆస్పత్రుల నమోదు, నిర్వహణ (హెచ్ఈఎం) మార్గదర్శకాలను నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్ఏ) జారీ చేసింది.

ఆయుష్మాన్ వయో వందన పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 1.06 లక్షల క్లెయింలను పరిష్కరించారు.

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాపరావు జాదవ్ రాజ్యసభలో ఇచ్చిన ఓ లిఖితపూర్వక సమాధానంలో ఈ సమాచారాన్ని అందించారు.

# జాతీయస్థాయిలో బేగంపేట హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



మెదక్, జులై 31: సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని బేగంపేట జెడ్పీ హై స్కూల్‌కు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కార్తీక, హర్షవర్ధన్, చైతన్యలు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి మార్గదర్శనంలో రూపొందించిన వినూత్న ఆవిష్కరణ "స్మార్ట్ వాకింగ్ స్టిక్" ఏఐసీటీఈ స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ –2025లో జాతీయ స్థాయికి ఎంపిక కావడం గర్వకారణం.

ఈ సందర్భంగా విద్యార్థులు ఇటీవల న్యూఢిల్లీలో గల గల్గొటియాస్ యూనివర్సిటీలో నిర్వహించిన ప్రత్యేక ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఎఐసిటిఇ) అసిస్టెంట్ డైరెక్టర్ అభయ్ జేర్, ఇన్నోవేషన్ డైరెక్టర్ ఎలెన్ గోవన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లోని ప్రతిభను, సృజనాత్మకతను దేశవ్యాప్తంగా గుర్తించినదానికి ఈ గౌరవమే నిదర్శనం. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజి రెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్పీ యాదగిరి, స్వామి తల్లిదండ్రులు, విద్యార్థులను అభినందించారు.

# కోదాడ కాన్వాసింగ్ అసోసియేషన్ నూతన కమిటీ




నల్గొండ, జులై 31: కోదాడ కాన్వాసింగ్ అసోసియేషన్ నూతన కమిటీని గురువారం సంఘ సభ్యులంతా కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అర్వపల్లి హనుమంతరావు, ప్రధాన కార్యదర్శిగా గడ్డం రాంబాబు, ఉపాధ్యక్షుడిగా చావ గోవిందరావు, సహాయ కార్యదర్శిగా ఓరుగంటి శ్రీనివాసరావు, కోశాధికారిగా సముద్రాల బద్రిష్ తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవరానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు అభినందనలు తెలిపి మాట్లాడారు. మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల సహకారంతో అసోసియేషన్ అభివృద్ధికి, సభ్యులకు, గుమస్తాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు.

అనంతరం గుమస్తాల సంఘం కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనంతు సైదులు, ఉపాధ్యక్షుడిగా వెంకట రాజారావు, ప్రధాన కార్యదర్శిగా వేమూరి నరసింహమూర్తి, సహాయ కార్యదర్శిగా పల్లా నాగరాజు, కోశాధికారిగా కొల్ల సురేశ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గట్ల కోటేశ్వరరావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి వీరారెడ్డి, ఓరుగంటి ప్రభాకర్, వెంపటి వెంకటేశ్వరరావు, వెంపటి మధుసూదన్, ఓరుగంటి పురుషోత్తం, చల్ల ప్రకాశ్, పర్వతాలు, అలీబాయ్, రఘు, సాయి, వీరయ్య, గరినే శ్రీధర్, తూనం కృష్ణ, రామినేని శ్రీనివాసరావు, యలమందల నరసయ్య, కనగాల నాగేశ్వరరావు, ఆవుల రామారావు, తోట శ్రీను, పైడిమర్రి వెంకటనారాయణ పాల్గొన్నారు.

# రూ.11 లక్షల కోట్లకు చేరుకున్న మహిళా స్వయంసహాయక బృందాల రుణ పంపిణీ

## గ్రామీణ ఆర్థిక సాధికారత కల్పనలో ఒక చరిత్రాత్మక ప్రగతి ప్రస్థానం

న్యూఢిల్లీ, జులై 31:దీన్ దయాళ్ అంత్యోదయ యోజన–జాతీయ గ్రామీణ ఉపాధి మిషన్ (డీఏవై–ఎన్ఆర్ఎల్ఎమ్) లో ఇది ఒక సరికొత్త అధ్యాయం... సాంప్రదాయక ఆర్థిక సంస్థల నుంచి మహిళా స్వయం సహాయ బృందాలకు (ఎస్‌హెచ్‌జీస్) రూ.11 లక్షల కోట్ల కన్నా ఎక్కువ మొత్తంలో రుణాలను అందించారు.

ఈ చరిత్రాత్మక విజయం బ్యాంకులు కొండంత అండ ఇవ్వడం వల్ల సాధ్యపడింది. ఇది అభివృద్ధి ఫలాలను సమాజంలో అన్ని వర్గాల వారికి అందేట్లు చూడాలని, మహిళలకు సాధికారతను కల్పించడంతో పాటు కింది స్థాయుల్లో ఆర్థిక దృఢత్వ పునాదులను బలోపేతం చేయాలన్న ప్రభుత్వ కట్టుబాటుకు అద్దం పడుతోంది.

పేద మహిళల భాగస్వామ్యంతో పటిష్ఠ సాముదాయక సంస్థలను నిర్వహించి ఆ మహిళల బతుకుదెరువుకు దన్నుగా నిలబడడం ద్వారా గ్రామాలను పేదరిక వలయం నుంచి బయటకు తేవాలన్నదే డీఏవై–ఎన్ఆర్ఎల్ఎమ్ ముఖ్యోద్దేశం. ఈ స్వయంసహాయ బృందాలు పల్లెల్లో రుణ పంపిణీకి ప్రధాన మార్గాలుగా మారిపోయాయి. దీంతో అభివృద్ధి ప్రయోజనాలను అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి తీసుకుపోవడంతో పాటు మహిళల నాయకత్వంలోని వాణిజ్య సంస్థలను పెంచి పోషించడానికి వీలవుతోంది. రుణాలను నిలకడైన రీతిలో అందజేస్తుండడం వల్ల పల్లె ప్రాంతాల మహిళల్లో కొత్త కొత్త సంస్థలను ఏర్పాటు చేయాలనే ఉత్సాహం పెరుగుతోంది. వారు తమకంటూ ఆదాయాన్ని సంపాదించిపెట్టగల సంస్థలను ధైర్యంగా స్థాపించగలుగుతున్నారు.

అసంఖ్యాక మహిళలు నెలకొల్పిన సంస్థలు జీవనోపాధికి పట్టుగొమ్మలుగా మారిన ప్రక్రియ చిత్తశుద్ధి కలిగిన బ్యాంకింగ్ భాగస్వాములు కీలక భూమిక పోషించనిదే ఇంతటి విశేష విజయానికి నోచుకొనేదే కాదు. ఈ కీలక తోడ్పాటే ఎస్‌హెచ్‌జీ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచి, అనేక మంది ఉమ్మడిగా కన్న కలలను నెరవేర్చి, ఆర్థిక స్వావలంబన దిశగా వారు సాగిస్తున్న ప్రయాణాన్ని వేగవంతం చేసింది.

బ్యాంకింగ్ ప్రతినిధులుగా సేవలు అందిస్తున్న ఎస్‌హెచ్‌జీ మహిళా సభ్యులను 'బ్యాంక్ సఖులు' అని పిలుస్తున్నారు. ఈ విజయంలో బ్యాంక్ సఖులు సైతం ముఖ్య పాత్ర పోషించారు. వీరు అలుపెరుగక చేస్తున్న కృషి రుణ వితరణతో పాటు రుణాల తిరిగి చెల్లింపులో కూడా కీలకంగా మారుతూ, ఎస్‌హెచ్‌జీలకు బ్యాంకింగ్ సంస్థలకు మధ్య విశ్వసనీయ అనుబంధాన్ని పెంచుతోంది.

'డీఏవై–ఎన్ఆర్ఎల్ఎమ్', 'లఖ్‌పతి దీదీ స్కీమ్'ల వంటి కార్యక్రమాల రూపంలో స్వయంసహాయ బ?ందాల ఉద్యమం లక్షలాది మంది మహిళలకు సాధికారితను అందిస్తోంది. రూ.11 లక్షల కోట్ల స్థాయిలో రుణ పంపిణీ, పూచీకత్తు అక్కర లేకుండానే రుణాలివ్వడం, వడ్డీలో తగ్గింపు సదుపాయం, ఇంకా ఇతరత్రా ఆర్థిక సహాయం, రుణమొత్తాల తిరిగి చెల్లింపు 98 శాతాని కంటే ఎక్కువగా నమోదు కావడం.. ఇవి ఈ కార్యక్రమాలు గొప్పగా విజయవంతం అయ్యాయని సూచిస్తున్నాయి.

బ్యాంకులు రుణాలను, ఆర్థిక సేవలను ప్రాధాన్య రంగ రుణాల విభాగం పరిధిలో అందజేశాయి. అంతేకాకుండా స్వయంసహాయ బృందాల సభ్యులకు రుణ లభ్యతను, ప్రక్రియలను కూడా బ్యాంకులు సులభతరం చేశాయని చెప్పుకోవచ్చు. మరో వైపు బ్యాంకింగ్ లావాదేవీల్లో, డాక్యుమెంట్లు– రుణ దరఖాస్తులను సిద్ధం చేయడంలో సభ్యులకు బ్యాంకు సఖులు మార్గదర్శనం చేశారు. ఆర్థిక వ్యవహార జ్ఞానంతో పాటు బీమా, పింఛన్ల వంటి పథకాల పట్ల అవగాహనను పెంచారు. ఆధార్, మొబైల్ ఫోన్ నంబర్లను బ్యాంకు ఖాతాలకు లింక్ చేయడంలో సాయం చేశారు. బ్యాంకులు ఇచ్చిన రుణాలను లబ్ధిదారులు సరైన సమయానికి తిరిగి చెల్లించేటట్లుగా బ్యాంక్ సఖులు చూశారు.

ఈ విజయం గణాంకాలను మించిన ఘనకార్యమని చెప్పాలి. మహిళలపై నమ్మకాన్ని పెట్టుకొని, వారికి తగిన వనరులను ఇచ్చి, అవకాశాలను అందించినప్పుడు వారు తమ శక్తియుక్తులను తప్పక చాటిచెబుతారని సూచించే సందర్భం. ఇది మొత్తంమీద చూస్తే, మరింత మంది ప్రజలు వృద్ధిలోకి వచ్చేటట్లు, గ్రామీణ భారతావని దృఢంగా మారేటట్లు తోడ్పడనుంది.

# రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

## – కాంగ్రెస్ నేత పరికపల్లి శ్రీనివాస్ గౌడ్

ఖమ్మం, జూలై 31 (నేటినిజం ప్రతినిధి) : గత పదేళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు పంపిణీ చేయడం హర్షనీయమని జిల్లా కాంగ్రెస్, బీసీ నాయకులు పరికపల్లి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ...రేషన్ కార్డుల జారీ నిరంతరంగా జరిగే పక్రియ అని, అర్హులై ఉండి కార్డు రాని వారు ఆందోళన చెందవద్దని సమీపంలోని మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. పదేళ్ల తర్వాత ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ కార్డులలో కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించడం వారి భవిష్యత్తుకు భరోసానివ్వడం ఎంతో అభినందనీయమన్నారు. అందుకు సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత పదేళ్ళలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి కి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను గడపగడపకు తీసుకుపోయి ప్రజలకు వివరించి, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలతో పాటు సర్పంచ్లను మెజార్టీ స్థానాలలో కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకుపోతున్నట్లు తెలిపారు.

# సాగర్‌మాలలో భాగంగా రైలు–రోడ్డు మార్గాల అనుసంధానం

న్యూఢిల్లీ, జులై 31:సాగర్‌మాల కార్యక్రమంలో భాగంగా 272 రోడ్డు, రైలు అనుసంధాన ప్రాజెక్టులను గుర్తించారు. వీటిని రోడ్డు, రవాణా, హైవేల శాఖ, రైల్వేల మంత్రిత్వ శాఖ, ప్రధాన ఓడరేవులు, నిర్దిష్ట ప్రాంతంలో ఫలానా వ్యాపారాన్ని నిర్వహించడానికి ప్రభుత్వ అనుమతిని పొందిన సంస్థలు (కన్సెషనేర్లు) వంటి ఏజెన్సీలు అమలు చేస్తున్నాయి. మొత్తం 272 ప్రాజెక్టుల్లో 74 ప్రాజెక్టులు పూర్తి కాగా, 67 ప్రాజెక్టుల పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. 131 ప్రాజెక్టులు రూపకల్పన దశలో ఉన్నాయి.

సాగర్‌మాలను ఆరంభించినప్పడే సమగ్ర విధాన మార్గదర్శనం, ఉన్నత స్థాయి సమన్వయం కోసం ఉన్నత స్థాయిలో నేషనల్ సాగర్‌మాల ఏపెక్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ప్రణాళికతో పాటు ప్రాజెక్టుల అమలుకు సంబంధించిన అంశాలను సమీక్షిస్తుంది. కేంద్ర ప్రభుత్వ విభాగాలు, మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇంకా వివిధ ఆసక్తిదారుల మధ్య సమన్వయాన్ని ఏర్పరచడానికి మ్యారిటైం స్టేట్స్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎంఎస్‌డీసీ) సమావేశాలను మంత్రిత్వ శాఖ తరచుగా నిర్వహిస్తోంది.

సాగర్‌మాల కార్యక్రమంలో భాగంగా, 839 ప్రాజెక్టులను గుర్తించారు. ఈ ప్రాజెక్టులను దాదాపు రూ.5.79 లక్షల కోట్ల అంచనా వ్యయంతో అమలు చేయాలని సంకల్పించారు. వీటిలో 119 ప్రాజెక్టులను రూ.2.42 లక్షల కోట్ల మొత్తం ప్రాజెక్టు వ్యయంతో ప్రభుత్వ–ప్రయివేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో అమలు చేస్తున్నారు. మిగతా ప్రాజెక్టులను ప్రభుత్వమే నేరుగా అందించే డబ్బుతో ఈపీసీ పద్ధతిలో చేపడుతున్నారు.

సాగర్‌మాల పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న ప్రాజెక్టుల విషయంలో, ఆయా ప్రాజెక్టులను మరింత వేగంగా అమలు చేయడానికీ, నిధులను నిజాయతీతో సరి అయిన పద్ధతిలో నియమాల ప్రకారం ఖర్చుచేయడానికీ సంబంధించిన సాగర్‌మాల ఆర్థిక సహాయ మార్గదర్శక సూత్రాలను ఓడరేవులు, నౌకాయానం, జలరవాణా మంత్రిత్వ శాఖ సవరించింది.

ఈ సమాచారాన్ని కేంద్ర ఓడరేవులు, నౌకాయానం, జలరవాణా శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ రాజ్యసభలో ఒక ప్రశ్నకు రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో తెలియజేశారు.

# స్మార్ట్ కిడ్స్ పాఠశాలలో దంత వైద్య శిబిరం



ఖమ్మం, జూలై 31 (నేటినిజం ప్రతినిధి) : స్థానిక స్మార్ట్ కిడ్స్ పాఠశాలలో గురువారం పాఠశాల చిన్నారులకు దంత వైద్య శిబిరం ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులకు వారి దంతాలను వైద్యులకు క్షుణ్ణంగా పరిశీలించి దంత సంరక్షణ పట్ల అవగాహన కల్పించారు. స్థానిక మమత దంత వైద్య కళాశాల వైద్యులు పాఠశాల చిన్నారుల పళ్ళు వరుసలను పరిశీలించి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అవసరమైన వారికి వైద్యులు చికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్య నిపుణులు చిన్నారులకు పలు దంత సలహాలను తెలియజేశారు. చాక్లెట్లు, రంగురంగుల తినుబండారాలను తినడం వలన దంతాల కు హాని జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజు ఉదయం దంతాలను పరిశుభ్రం చేసుకున్న తర్వాతనే ఏవైనా తినా లని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనపు కృష్ణ చైతన్య మాట్లాడుతూ శరీర ఆరోగ్యానికి దంత సంరక్షణ కీలకమని తెలిపారు. అందుకే పాఠశాల విద్యార్థులు ప్రతిరోజు దంతాలను సంరక్షించుకోవడంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల దంత సంరక్షణ పట్ల జాగ్రత్తలు పాటించినప్పుడే పిల్లల ఆరోగ్యం ఉత్తమంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతని సుకన్య,ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

# గొప్ప పనికి శ్రీకారం చుట్టిన సోనూసూద్.. 500 మంది వృద్ధుల కోసం..

హైదరాబాద్, జులై 29 రీల్ లైఫ్‌లో విలన్‌గా నటించి అలరించిన సోనూసూద్ రియల్ లైఫ్‌లో మాత్రం ఎంతో మంది మన్ననలు పొందుతున్నారు. కోవిడ్ సమయంలో వేలాది మందికి ఆపన్నహస్తం అందించి రియల్ హీరోగా పేరు తెచ్చుకున్న సోనూసూద్, ఇప్పుడు మరో గొప్ప నిర్ణయం తీసుకున్నారు. జూలై 30న తన పుట్టినరోజు సందర్భంగా సామాజిక సేవలో మరో మైలురాయిగా నిలిచే వృద్ధాశ్రమం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సోనూసూద్ ఏర్పాటు చేస్తున్న ఈ వృద్ధాశ్రమంలో 500 మంది నిరాశ్రయ వృద్ధులకు నూతన జీవితాన్ని అందించేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఇది కేవలం తల దాచుకునే చోటు మాత్రమే కాదు.. వారికి అవసరమైన వైద్య సహాయం, పౌష్టికాహారం, ప్రేమతో కూడిన వాతావరణం అందించడమే మా లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు. వృద్ధుల జీవితంలో గౌరవంతో కూడిన మూడో ఇన్నింగ్స్‌కి ఇది సహాయ పడుతుందని తెలిపారు. కరోనా సమయంలో వలస కూలీలను స్వస్థలాలకు చేర్చడం, ప్రత్యేక బస్సుల ఏర్పాటు, ఆహార మరియు నివాస సౌకర్యాలు కల్పించడం వంటి సేవలతో సోనూసూద్ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారు. అప్పటి నుంచి ప్రజల దృష్టిలో దేవుడిగా మారారు.

ఆ తర్వాత కూడా విరామం లేకుండా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, రైతులకు సహాయం, వైద్య చికిత్స కోసం ఆర్థిక సాయం వంటి పలు కార్యక్రమాలు నిర్వహించారు. తన స్వంత ట్రస్ట్ ద్వారా అనేక మందిని ఆదుకున్నారు. ఈ అంకితభావానికి గుర్తింపుగా, ఇటీవలే మిస్ వరల్డ్ 2025 ఫైనల్స్ వేడుకలో సోనూసూద్‌కు ప్రతిష్ఠాత్మక మానవతావాది అవార్డు కూడా లభించింది. ఇది ఆయన చేస్తున్న సేవలకు గౌరవ సూచకం. ఇప్పుడు 52వ వసంతంలోకి అడుగుపెట్టిన సోనూసూద్, తన పుట్టినరోజును మరో సామాజిక సేవా ప్రాజెక్టుతో ప్రారంభించడం గమనార్హం. సామాజిక మాధ్యమాల్లో అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. నెటిజెన్లు, సెలబ్రిటీలు ఆయనపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలి




ఖమ్మం, జులై 31: సింగరేణిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్/కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియాలో అమలులో ఉన్న హై పవర్ కమిటీ వేతనాలను తక్షణమే అమలు చేయాలని ఏబీకేఎంఎస్ కార్యదర్శి, వేజ్ బోర్డు సభ్యుడు పి.మాధవ నాయక్ డిమాండ్ చేశారు.

గురువారం రుద్రంపూర్ సిఎస్‌పిలో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నర్సింగరావు పిట్ సెక్రెటరీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, స్టాండర్డైజేషన్ కమిటీ సభ్యుడు టీఎస్.పవన్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా పి.మాధవ నాయక్ మాట్లాడుతూ.. సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ యూనియన్‌లో నూతనంగా చేరిన రాజేశ్, గుమ్మడి కృష్ణమూర్తికి హార్దిక స్వాగతం పలికారు. ప్రస్తుతం కోల్ ఇండియాలో అన్‌స్కిల్డ్ కార్మికుడికి రూ.1,285, సెమిస్కిల్డ్‌కు రూ.1,317, స్కిల్డ్ కార్మికుడికి రూ.1,383 చొప్పున రోజువారీ వేతనాలు చెల్లిస్తుండగా, తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కేవలం రూ.480 మాత్రమే చెల్లించడమన్నది తీవ్రమైన శ్రమ దోపిడీని సూచిస్తోందని విమర్శించారు.

గత 12 ఏళ్లుగా కనీస వేతనాల చట్టానికి సవరణ జరగక పోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపుతోందన్నారు. ఇది 1975 నాటికి పరిశ్రమల జాతీయాకరణకు ముందు జరిగిన శ్రమదోపిడీని తలపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు సంస్థ ఉత్పత్తి, లాభాల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్నందున, వార్షిక బోనస్, కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయాలు, వార్షిక సెలవులు, గ్రాట్యూటీ, ఇతర సామాజిక భద్రతల విధానాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా సింగరేణిలో ఖాళీగా ఉన్న క్వార్టర్లకు మరమ్మతులు చేసి, అవి ఔట్ సోర్సింగ్ కార్మికులకు కేటాయించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మొగిలిపాక రవి, ఉట్ల గణేశ్, సంగం చంద్ర, రాజమౌళి, అలీ ప్రకాశ్, శ్యామ్లాల్, ఇనపనూరి నాగేశ్వరరావు, రాకేశ్, సింగారి శ్రీనివాస్, వీరవసంత్, కొండేటి నరసయ్య పాల్గొన్నారు.

# టీసీఎస్ లేఆఫ్స్ వేళ.. ఇన్ఫోసిస్‌లో 20 వేల ఉద్యోగాలంటూ కీలక ప్రకటన

హైదరాబాద్ జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్);భారత్‌లోని అతి పెద్ద ఐటీ సర్వీసుల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ పెద్ద ఎత్తున లేఆఫ్స్ ప్రకటించి ఉద్యోగులకు షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది కల్లా తన మొత్తం ఉద్యోగుల్లో 2 శాతం అంటే దాదాపు 12,200 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. టీసీఎస్‌లో ఉద్యోగుల తొలగింపు వేల దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ తాజాగా కీలక ప్రకటన చేసింది. ఈ ఏడాది సుమారు 20 వేల మంది కాలేజ్ గ్రాడ్యుయేట్లను నియమిం చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. ఓ జాతీయ మీడియా తో ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ మాట్లా డుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఇక ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 17 వేల మందికిపైగా ఉద్యోగులను నియమించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై కంపెనీ ఎక్కువగా దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే భారీగా హైరింగ్‌కు సిద్ధమవు తున్నామని సీఈఓ తెలిపారు.'ఈ ఏడాది మొదటి త్రైమాసికంలోనే 17 వేల మందికి పైగా నియమిం చుకున్నాం. మొత్తం 2025 సంవత్స రానికి 20 వేల మంది కాలేజ్ గ్రాడ్యుయేట్లను నియ మించుకోవాలని భావిస్తున్నాం. కృత్రి మ మేధస్సు (ఏఐ), డిజిటల్ మార్పు లు, తదితర రంగాల్లో ఇన్ఫోసిస్ ఇప్పటికే పెట్టుబడులు పెట్టింది.

# కోర్టు గది సరిపోదు.. క్రికెట్ స్టేడియం కావాలేమో..!

## –సెంథిల్ బాలాజీ కేసులో సుప్రీం కీలక వ్యాఖ్యలు..!

న్యూ గ్ఢిల్లీ జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మాజీ మంత్రి వీ సెంథిల్ బాలాజీ ప్రమేయం ఉన్న ఉద్యోగ కుంభకోణం విషయం లో తమిళనాడు ప్రభుత్వం తీరుపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. సెంథిల్ బాలాజీ ప్రమేయం ఉన్న ఉద్యోగ కుంభకోణంపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి మాజీ మంత్రి డబ్బులు తీసుకున్నట్లుగా అభియోగాలు నమోదైన విషయం తెలిసిందే.

జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మల్య బాగ్చి ధర్మాసనం తమిళనాడు సర్కారుపై మండిపడింది. ప్రభుత్వం కావాలనే విచారణను ఆలస్యం చేస్తున్నట్లుగా కనిపిస్తోందని మండిపడింది. ప్రభుత్వం కేసును మూసివేసేందుకు ప్రయత్నిస్తే.. న్యాయశాఖ అడ్డుకుందంటూ మందలించింది.ఈ కేసులో 2000 మంది నిందితులు, 500 మంది సాక్షులుగా ఉన్నారన్న ధర్మాసనం.. భారత్‌లో అత్యధిక మంది విచారణలో పాల్గొన్న కేసు ఇదే అవుతుందేమోనని వ్యాఖ్యానించింది. నిందితులందరికీ కోర్టు గది సరిపోదని.. ఓ క్రికెట్ స్టేడియం కావాలంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. నిందితుడు, సాక్షుల పూర్తి వివరాలు సమర్పించాలని సర్వోన్నత న్యాయస్థానం తమిళనాడు సర్కారును ఆదేశించింది. బాలాజీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ విచారణకు హాజరయ్యారు. అన్నాడీఎంకే హయాంలో సెంథిల్ బాలాజీ రవాణాశాఖ మంత్రిగా పని చేశారు. ఆ సమయంలో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి లంచం తీసుకున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఈ మేరకు ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఆయన స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీలో చేరి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రవాణాశాఖ కేసులో ఆయనను ఈడీ 2023లో అరెస్టు చేసింది.దాదాపు ఏడాదికిపైగా ఆయన జైలులో ఉన్నారు. బెయిల్‌పై వచ్చాక ఆయనకు స్టాలిన్ ప్రభుత్వం ఆయనను మంత్రిగా బాధ్యతలు అప్పగించింది. తాజాగా ఈ కేసు సుప్రీంకోర్టు వరకు చేరడంతో ఆయన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇంతకు ముందు ఈ కేసులో మంగళవారం సైతం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. కుంభకోణంలో 2వేలమందికి పైగా నిందితులుగా పేర్కొంటూ.. బాలాజీకి సంబంధించిన కేసుల విచారణను ఆలస్యం చేయడానికి తమిళనాడు ప్రభుత్వం చేసిన ప్రయత్నంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. మనీలాండరింగ్ కేసులో బెయిల్ మంజూరైన కొద్దిరోజులకే తిరిగి మంత్రిగా నియమించడంపై కోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. గత ఏడాది సెప్టెంబర్ 26న బెయిల్ రాగా.. 29న ఆయన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. స్టాలిన్ కేబినెట్‌లో గతంలో నిర్వహించిన శాఖలనే మళ్లీ కేటాయించారు.

# ఎపిలో మద్యం స్కామ్.. రంగారెడ్డిలో నగదు డంప్ పట్టివేత

హైదరాబాద్ జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఆంధ్రప్రదేశ్ మద్యం స్కామ్ కేసులో మరో సంచలనం వెలుగులోకి వచ్చింది. అక్రమ మద్యం నగదు డంప్‌ను ఎపి సిట్ అధికారులు పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కాచారంలో నగదును ఎపి సిట్ అధికారులు పట్టుకున్నారు. సులోచన ఫార్మస్ గెస్ట్‌హౌజ్‌లో 12 అట్టపెట్టెల్లో దాచిన రూ.11 కోట్ల నగదును పట్టుకున్నారు. రాజ్ కసిరెడ్డి సూచనల మేరకు నగదును 12 బాక్సుల్లో ఉంచినట్టు గుర్తించారు. నిందితుడు వరుణ్ పురుషోత్తమ్ వాంగ్మూలం ఆధారంగా ఎపి సిట్ సోదాలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ మద్యం స్కామ్ కేసులో ఎ40గా వరుణ్ పురుషోత్తమ్ ఉన్నాడు. నగదు సీజ్ ఘటనలో చాణక్య, వినయ్ ప్రాతపైనా విచారణ చేస్తున్నారు.రాజ్ కెసి రెడ్డి, చాణక్య ఆదేశాల మేరకు జూన్ 2024లో వినయ్ సాయంతో వరుణ్ రూ.11 కోట్ల నగదును 12 అట్ట పెట్టెలను ఆఫీస్ ఫైళ్ల పేరుతో దాచినట్టు అధికారులు గుర్తించారు. వరుణ్ పురుషోత్తమ్ నేరాన్ని అంగీకరించి నిజాలు బయటపెట్టడంతో లిక్కర్ స్కామ్ వెలుగులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ మద్యం స్కామ్ లో రూ.3500 కోట్ల పైగా అక్రమాలు జరిగినట్టు అధికారులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

# హైదరాబాద్‌లో రెండు రోజుల బహిరంగ విచారణ, శిబిరాన్ని ముగించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ: 109 కేసుల విచారణ

న్యూఢిల్లీ, జులై 31:తెలంగాణలోని హైదరాబాద్‌లో మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన 109 కేసుల విచారణ అనంతరం రెండు రోజుల 'బహిరంగ విచారణ, శిబిరాన్ని' జాతీయ మానవ హక్కుల కమిషన్ ముగించింది. బాధితులు, ఫిర్యాదిదారులు, అధికారుల సమక్షంలో ఎన్‌హెచ్‌ఆర్సీ ఛైర్‌పర్సన్ జస్టిస్ శ్రీ రామసుబ్రమణియన్, సభ్యులు జస్టిస్ (డాక్టర్) బిద్యుత్ రంజన్ సారంగి, శ్రీమతి విజయ భారతి సయాని విచారణ చేపట్టారు. సెక్రటరీ జనరల్ శ్రీ భరత్ లాల్, డైరెక్టర్ జనరల్ (విచారణ) శ్రీ ఆర్‌పీ మీనా, రిజిస్ట్రార్ (న్యాయం) శ్రీ జోగిందర్ సింగ్, కమిషన్‌కు చెందిన ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బహిరంగ విచారణలో భాగంగా కమిషన్ ఏర్పాటు చేసిన రెండు బెంచులు 90 కేసులను విచారించాయి. వీటిలో ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాల కారణంగా చిన్నారుల మరణం, నివాస ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద పెరిగిపోవడం, అగ్ని ప్రమాదాల్లో మరణాలు, పులుల దాడులు, గిరిజన మహిళల మానవ అక్రమ రవాణా, గిరిజన కుటుంబాలను బలవంతంగా తరలించడం, కనీస మానవ అవసరాలను నిరాకరించడం, అత్యాచారాలతో సహా మహిళలపై జరుగుతున్న దాడులు, చిన్నారులపై జరిగిన నేరాలు, పోలీసుల దురాగతాలు, ఆత్మహత్యలు, దళితబంధు పథకం నిధుల దుర్వినియోగం, కుటుంబ పింఛను కేసులు, ప్రాథమిక పాఠశాలలు అందుబాటులో లేకపోవడం, గురుకులాల్లో కల్తీ ఆహారం, పోషకాహార లోపం కేసులు, పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం తదితరమైనవి ఉన్నాయి.

అర్హతలను పరిశీలించిన అనంతరం తగిన ఆదేశాలను కమిషన్ జారీ చేసింది. కమిషన్ ఇచ్చిన ముఖ్యమైన తీర్పుల్లో కొన్ని:

ఖమ్మం జిల్లాలో కుల వివక్ష, సామాజిక బహిష్కరణకు సంబంధించిన కేసులో, ఎన్‌హెచ్‌ఆర్సీ జోక్యం తర్వాత పోలీసులు చర్యలు తీసుకున్నారు. గ్రామస్థులు ఆ కుటుంబంపై కుల వివక్ష లేదా సామాజిక బహిష్కరణను అమలు చేయకుండా చేశారు.

తెలంగాణలోని గురుకుల పాఠశాలల్లో 48 మంది విద్యార్థులు మరణించడం, 886 ఫుడ్ పాయిజన్ ఘటనల కేసుకు సంబంధించిన నివేదికను నాలుగు వారాల్లోగా సమర్పించాలని అయిదు గురుకుల పాఠశాలల కార్యదర్శులను కమిషన్ ఆదేశించింది.

అక్రమ అరెస్టు, లాఠీఛార్జికి సంబంధించిన మరో కేసులో పర్యావరణ అనుమతి, ప్లాంట్ ఏర్పాటు చేయడానికి సమ్మతితో సహా సంబంధిత పత్రాలను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశించింది.

డీఆర్‌డీవో రాకెట్ ప్రొపెల్లెంట్ యూనిట్లో జరిగిన పేలుడులో మరణించిన నలుగురి కుటుంబాల్లో మూడింటికి మొత్తంగా రూ.50 లక్షల పరిహారాన్ని చెల్లించారు. మరో బాధిత కుటుంబానికి సైతం పరిహారం అందించాలని కమిషన్ ఆదేశించింది.

పెరుగుతున్న వీధికుక్కల బెడదకు సంబంధించి అయిదో తరగతి విద్యార్థి సమర్పించిన కేసులో, ఈ సమస్యను తగ్గించేందుకు ప్రామాణిక నిర్వహణ విధానంతో రావాలని సంబంధిత అధికారులను కమిషన్ ఆదేశించింది.

గిరిజన మహిళల మానవ అక్రమ రవాణాకు సంబంధించిన కేసులో తప్పు చేసిన కానిస్టేబుల్‌ను విధుల నుంచి తొలగించారు. అక్రమ రవాణాకు గురైన అనేక మంది గిరిజన మహిళలను రక్షించారు.

అనంతరం, పెండింగ్‌లో ఉన్న19 కేసులను కమిషన్ ఫుల్ బెంచ్ విచారించింది. వాటిలో 9 కేసుల్లో బాధితులకు రూ. 49.65 లక్షల ఆర్థిక సాయం అందించాలని కమిషన్ సిఫారసు చేసింది. వాటిలో రూ. 22.50 లక్షలను ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం చెల్లించింది. అలాగే మిగిలిన రూ. 27.15 లక్షల మొత్తాన్ని చెల్లించడానికి అంగీకరించింది.

ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం మెరిట్ ఆధారంగా 29 కేసులను కమిషన్ ముగించింది. చెల్లింపులకు సంబంధించిన సాక్ష్యంతో పాటు అమలు నివేదిక చూపిన అనంతరం రెండు కేసులను ముగించారు.

2025, జులై 28న కేసుల విచారణ అనంతరం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీస్ డైరెక్టర్ జనరల్, ఇతర ఉన్నతాధికారులతో 2025, జులై 29న మానవ హక్కులకు సంబంధించిన వివిధ అంశాలపై కమిషన్ సమావేశం నిర్వహించింది. ఎవరినీ విస్మరించకుండా ప్రభుత్వ విధానాలు, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాల్సిన విధానంపై వారికి అవగాహన కల్పించింది. మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా చేపట్టాల్సిన నివారణ, వ్యవస్థీకృత చర్యలకు ప్రాధాన్యమిచ్చింది. పర్యావరణం, వాతావరణ మార్పులు, వ్యాపారాల వల్ల ప్రభావితమవుతున్న మానవ హక్కుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది.

మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలు, తెలంగాణలో చాలా జిల్లాల్లో మరణాలకు దారితీస్తున్న మనిషి–జంతువు మధ్య సంఘర్షణ, పెద్ద సంఖ్యలో చిన్నారులు పోషకాహార లోపంతో బాధపడటం, ఎస్సీ కార్పొరేషన్ ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు లేకపోవడం, చేప పిల్లలను ఉత్పత్తి చేసే వారితో సహా రైతుల దుస్థితి, ఎల్జీబీటీక్యూఐ సమాజం హక్కులు, తదితర అంశాలపై చర్చించారు. ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర అధికారులు చేపడుతున్న చర్యలను కమిషన్ ప్రశంసించింది. తాము అవలంబిస్తున్న ఉత్తమ విధానాలను అధికారులు కమిషన్ ముందుంచారు. మానవ హక్కుల ఉల్లంఘన బాధితులకు న్యాయం జరిగేలా సమయానుగుణంగా నివేదికలను తమకు సమర్పించాలని కమిషన్ సూచించింది. మానసిక ఆరోగ్యం, వెట్టి చాకిరీ, ఆహారం, భద్రతా హక్కు సహా వివిధ అంశాలకు సంబంధించి కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని స్పష్టం చేసింది. కమిషన్ సిఫారసులను పూర్తిగా పాటిస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హామీ ఇచ్చారు.

అనంతరం.. పౌర ప్రతినిధులు, మానవ హక్కుల కార్యకర్త (హెచ్ఆర్‌డీ) లతో కమిషన్ సమావేశం నిర్వహించింది. మానవ హక్కుల పరిరక్షణ, ప్రోత్సాహం కోసం ఎస్‌హెచ్ఆర్సీలు, పౌర ప్రతినిధులతో కలసి పనిచేయడంపై తమకు విశ్వాసం ఉందని కమిషన్ పునరుద్ఘాటించింది. వయోధికులు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన రోగులు, తదితరులకు సంబంధించిన సమస్యలను ఎన్జీవో ప్రతినిధులు, హెచ్ఆర్డీలు తెలియజేశారు. సంరక్షులకు తోడ్పాటు ఇచ్చేలా తీవ్రమైన వైకల్యంతో ఇబ్బంది పడుతున్న దివ్యాంగజనులకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. గుర్తింపు ధ్రువపత్రాలను పొందడంలో పేద చిన్నారులకు ఎదురవుతున్న సమస్యలను వారు వివరించారు. రాష్ట్రంలో వారు చేస్తున్న కార్యక్రమాలను కమిషన్ ప్రశంసించింది. ఎలాంటి భయం, పక్షపాతం లేకుండా పనిని కొనసాగించాలని ప్రోత్సహించింది.జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో ఎన్జీవోలు, హెచ్‌ఆర్డీల భాగస్వామ్యం దేశంలో మానవ హక్కులను బలోపేతం చేయడానికి తోడ్పడుతుందన్న ఎన్‌హెచ్‌ఆర్సీ ఛైర్‌పర్సన్ జస్టిస్ వీ రామసుబ్రమణియన్ పరిశీలనతో సమావేశం ముగిసింది. మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి ఫ్రతీఇ·నివబి.నితిఇ.తిని ద్వారా ఆన్‌లైనులో ఫిర్యాదులను నమోదు చేయవచ్చని వారికి తెలియజేశారు.

# 170 గంటలు భరతనాట్యం ప్రదర్శన.. మంగళూరు విద్యార్థిని వరల్డ్ రికార్డ్




బెంగళూరు జూలై 31(ఎక్స్ ప్రెస్ న్యూస్):: మంగళూరు విద్యార్థిని ప్రపంచ రికార్డ్ సృష్టించింది. మంగళూరులోని సెయింట్ అలోసియస్ (డీమ్డ్ టు బి యూనివర్సిటీ)లో చివరి సంవత్సరం బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థిని రెమోనా ఎవెట్ పెరీరా.. 170 గంటల పాటు నిరంతరం అద్భుతమైన భరతనాట్యం ప్రదర్శన ఇచ్చింది.

దీంతో గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో ఆమె తన పేరును లిఖించుకుంది. అద్భుతమైన భరతనాట్యం ప్రదర్శనకు రెమోనాపై ప్రేక్షకులు ప్రశంసలు కురిపించారు. పెరీరా జూలై 21న అసాధారణ ప్రదర్శనను ప్రారంభించి జూలై 28న ముగించింది. ఏడు రోజులు.. 170 గంటలు నిద్ర లేకుండా ఆమె ప్రదర్శన ఇచ్చింది. ఆమె అంకితభావం, ఓర్పు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచాయి. ప్రదర్శన అనంతరం వారు నిలబడి చప్పట్లతో అభినందించారు. కాగా, అంతరాయం లేకుండా ఇంత సుదీర్ఘకాలం భారతీయ శాస్త్రీయ నృత్య రూపాన్ని ప్రదర్శించిన మొదటి వ్యక్తిగా రెమోనా నిలిచింది. సెయింట్ అలోసియస్ కళాశాలలోని రంగ అధ్యయన కేంద్రం డైరెక్టర్ క్రిస్టోఫర్ డిసౌజా మాట్లాడుతూ.. ప్రదర్శన అంతటా పెరీరాకు 15 నిమిషాల స్వల్ప విరామాలు అనుమతించబడ్డాయని చెప్పారు. ఆమె దృఢ సంకల్పాన్ని ప్రశంసిస్తూ.. "రెమోనా.. నువ్వు, పట్టుదల, ఓర్పుతో మంగళూరును గర్వపడేలా చేశావు. నీ కలను చరిత్రగా మార్చావు. నీ కళాత్మకత, దృఢ సంకల్పంతో ఒక తరమంతా స్ఫూర్తినిచ్చావు" అని ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో ఆయన పేర్కొన్నారు.

మూడేళ్ల వయసులో నృత్యం ప్రారంభం

ప్రఖ్యాత గురువు శ్రీవిద్య మురళీధర్ ఆధ్వర్యంలో పెరీరా మూడేళ్ల వయసులో భరతనాట్యం నేర్చుకోవడం ప్రారంభించింది. ఆమె 2019లో సోలోగా అరంగేట్రం చేసింది. అప్పటి నుండి ప్రసిద్ధి చెందిన ప్రదర్శనకారిణిగా పేరు తెచ్చుకుంది. ఈ రికార్డు ప్రదర్శన కేవలం వ్యక్తిగత మైలురాయి మాత్రమే కాదని, ప్రపంచ వేదికపై శాస్త్రీయ నృత్య రూపానికి నివాళి అని ఆమె అన్నారు.

# హరియాణాలో దారుణం.. దొంగతనం చేశాడని నెపంతో తలకిందులుగా వేలాడదీసి చిత్ర హింసలు

గురుగ్రామ్ జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: హరియాణాలోని గురుగ్రామ్ నగరంలో దారుణం చోటు చేసుకుంది. దొంగతనం చేశాడని నెపంతో ఓ వ్యక్తిని సెక్యూరిటీ గార్డులు తలకిందులుగా వేలాడదీసి చిత్ర హింసలు పెట్టారు. ఓ నిర్మాణంలో ఉన్న భవనంలో కరెంటు వైర్లు దొంగలించాడని జెసిబి డ్రైవర్ అయిన బాధితుడిని సెక్యూరిటీ గార్డులు హింసించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నలుగురు సెక్యూరిటీ గార్డులను అదుపులోకి తీసుకున్నారు. ఆ నలుగురు పుష్పేంద్ర, అజిత్ సింగ్, కృష్ణ కుమార్, అమిత్ కుమార్‌లుగా గుర్తించారు. బాధితుడికి ప్రస్తుతం ఆస్పత్రిలో వైద్యం అందుతోంది. దీనిపై స్పందించిన గురుగ్రామ్ పోలీసులు చట్టానికి ఎవరు అతీతులు కారని.. ఈ ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# శ్రీవాణి టికెట్లపై టీటీడీ కీలక నిర్ణయం

## –శ్రీవాణి కోటా కింద రోజుకు 1500 టికెట్లను 2 వేలకు పెంపు

తిరుపతి జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్);శ్రీవాణి టికెట్లపై టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. భక్తుల రద్దీ దృష్ట్యా శ్రీవాణి టికెట్ల కోటాను భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు శ్రీవాణి కోటా కింద రోజుకు 1500 టికెట్లు ఇస్తున్నారు. ఆ కోటాను 2 వేలకు పెంచింది. ఇకపై ప్రతి రోజు కరెంటు బుకింగ్ కోటా కింద తిరుమలలో రెండు వేల టికెట్లు, రేణిగుంట విమానాశ్రయంలో 400 టికెట్లు జారీ చేయాలని టీటీడీ నిర్ణయించింది. శ్రీవాణి దర్శన సమయంలోనూ టీటీడీ మార్పులు చేసింది. శ్రీవాణి కోటా కింద ప్రస్తుతం ఉదయం మాత్రమే భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. ఇకపై సాయంత్రం కూడా దర్శనానికి అనుమతించాలని టీటీడీ నిర్ణయించింది. ఇలా రెండు పూటలు దర్శనానికి అనుమతించడం వల్ల గదులకు నెలకొన్న డిమాండ్ తగ్గుతుందని టీటీడీ అధికారులు చెబుతున్నారు.

# మధ్యప్రదేశ్‌లో 23,000 మంది మహిళలు, బాలికలు మిస్సింగ్..

## –మహిళలపై జరిగిన నేరాలతో సంబంధం ఉన్న 1,500 మంది నిందితులు పరారీలో ఉన్నారు

## – అసెంబ్లీకి వెల్లడించిన సీఎం మోహన్ యాదవ్

భోపాల్ జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: సుమారు 23,000 మంది మహిళలు, బాలికలు కనిపించడం లేదు. అత్యాచారం, మహిళలపై జరిగిన నేరాలతో సంబంధం ఉన్న 1,500 మంది నిందితులు పరారీలో ఉన్నారు. ఆ రాష్ట్ర సీఎం ఈ విషయాలను స్వయంగా అసెంబ్లీకి వెల్లడించారు. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో మహిళలు, బాలికలు అదృశ్యమవుతున్నారు. మహిళలపై అత్యాచార కేసులు కూడా పెరుగుతున్నాయ. మాజీ హోంమంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలా బచ్చన్ దీనిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కేసుల వివరాలను అసెంబ్లీలో కోరారు.కాగా, మధ్యప్రవేశ్ సీఎం మోహన్ యాదవ్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. 2024 జనవరి 1 నుంచి 2025 జూన్ 30 వరకు 21175 మంది మహిళలు, 1954 మంది బాలికలు అదృశ్యమయ్యారు. ఏడాదికిపైగా ఆ రాష్ట్రంలో తప్పిపోయిన మహిళల సంఖ్య 23129కు చేరుకున్నదని వెల్లడించారు.మరోవైపు అత్యధికంగా సాగర్ జిల్లాలో 1,069 మంది మహిళలు మిస్సింగ్ అయ్యారు. జబల్పూర్ జిల్లాలో 946 మంది, ఇండోర్ జిల్లాలో 788 మంది, భోపాల్ (గ్రామీణ) జిల్లాలో 688 మంది, ఛతర్‌పూర్ జిల్లాలో 669 మంది, రేవా జిల్లాలో 653 మంది, ధార్ జిల్లాలో 637 మంది, గ్వాలియర్ జిల్లాలో 617 మంది మహిళలు అదృశ్యమయ్యారు.కాగా, అత్యాచారం, మహిళలపై జరిగిన నేరాలతో సంబంధం ఉన్న 1,500 మంది నిందితులు పరారీలో ఉన్నారు. మహిళలపై అత్యాచారం చేసిన నిందితుల్లో 292 మంది, మైనర్లపై అత్యాచారానికి పాల్పడిన నిందితుల్లో 283 మంది అంటే మొత్తంగా 575 మంది అత్యాచార నిందితులు ఇప్పటికీ స్వేచ్ఛగా తిరుగుతున్నట్లు ప్రభుత్వ గణాంకాల ద్వారా తెలుస్తున్నది. లైంగిక వేధింపుల కేసుల్లో పరారీలో ఉన్న వారి సంఖ్య 610కు చేరింది. మహిళలు, బాలికల అదృశ్యానికి సంబంధించిన ఇతర కేసుల్లో 320 మంది నిందితులు పరారీలో ఉన్నారు.

# భారత ఆర్థిక వ్యవస్థ క్షీణించింది

## -అదానీకి సహాయం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసింది

## – రాహుల్ గాంధీ విమర్శలు..!

న్యూ డిల్లీ జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 25శాతం సుంకాలు విధించడంపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై మండిపడ్డారు. ట్రంప్ 30–32 సార్లు కాల్పుల విరమణపై ప్రకటన చేరశారని.. ఐదు భారతీయ జెట్ విమానాలు కూలిపోయాయని వ్యాఖ్యానించారన్నారు. ట్రంప్ తాజాగా సుంకాలు విధిస్తామని చెబుతున్నారని.. అయినా ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు సమాధానం చెప్పలేకపోతున్నారని ప్రశ్నించారు. దీని వెనుక అసలు కారణాలు ఏంటీ? ఆయనపై ఎవరి నియంత్రణ ఉంది? విదేశాంత మంత్రి ప్రసంగాలు చేస్తూ.. దేశ విదేశాంగ విధానం ఆకట్టుకుంటుందని చెబుతున్నారని విమర్శించారు. ఓ వైపు అమెరికా.. మరో వైపు చైనా వెంట పడుతోందని.. ప్రతినిధి బృందాలను పంపినా ఓ దేశం పాకిస్తాన్ వైఖరిని ఖండించలేదన్నారు.దేశాన్ని ఎలా పరిపాలిస్తున్నారంటూ నిలదీశారు. పూర్తిగా గందరగోళ పరిస్థితి ఉందని.. మోదీ తన ప్రసంగంలో చైనా, ట్రంప్ పేర్లను ప్రస్తావించలేదని.. పాకిస్తాన్ సైనిక అధిపతితో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భోజనం చేస్తున్నారని.. తాము గొప్ప విజయం సాధించామని ప్రధాని చెబుతున్నారంటూ విమర్శలు గుప్పించారు. భారత ఆర్థిక వ్యవస్థ క్షీణించిందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు నిజమేనని రాహుల్ గాంధీ అన్నారు. ఈ విషయం ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ ఈ విషయం తెలుసునన్నారు. ఈ విషయంలో ట్రంప్ వాస్తవాలు చెప్పినందుకు సంతోషంగా ఉందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ క్షీణిస్తుందని ప్రపంచమంతా తెలుసునని.. అదానీకి సహాయం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందన్నారు. మోదీ ఒకే వ్యక్తి పని చేస్తారని.. ఆ వ్యక్తి అదానీ మాత్రమేనన్నారు.

# 127 ఏళ్ల తర్వాత పవిత్ర పిప్రహ్వా అవశేషాల పునరాగమనాన్ని స్వాగతించిన ప్రధాని

న్యూఢిల్లీ, జులై 31:భగవాన్ బుద్ధుడి పవిత్ర పిప్రహ్వా అవశేషాలు 127 ఏళ్ల సుదీర్ఘ కాలం అనంతరం భారత్‌కు తిరిగి రావడంపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. సుసంపన్నమైన దేశ సాంస్కృతిక వారసత్వంలో గర్వించదగిన, ఆనందకరమైన క్షణంగా దీనిని అభివర్ణించారు.

వికాస్ భీ విరాసత్ భీ స్ఫూర్తిని చాటేలా చేసిన ఓ ప్రకటనలో.. భగవాన్ బుద్ధుడి బోధనలపట్ల భారత్‌కు ఉన్న పూజ్య భావాన్ని, అలాగే వాటి ఆధ్యాత్మిక, చారిత్రక వారసత్వాన్ని పరిరక్షించడంలో దేశ అచంచలమైన నిబద్ధతను ప్రధాన మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చేసిన వరుస పోస్టుల్లో శ్రీ మోదీ ఇలా పేర్కొన్నారు:

భగవాన్ బుద్ధుడి పవిత్ర పిప్రహ్వా అవశేషాలు 127 ఏళ్ల తర్వాత స్వదేశానికి తిరిగి రావడం ప్రతి భారతీయుడికీ గర్వకారణం. ఈ పవిత్ర అవశేషాలు భగవాన్ బుద్ధుడితో భారత్‌కు ఉన్న సన్నిహిత సంబంధాన్ని, ఆయన ఉదాత్త బోధనలను చాటుతున్నాయి. మహిమాన్వితమైన మన సంస్కృతిలోని వివిధ అంశాలను సంరక్షించి, భద్రపరచడంలో మా అంకిత భావానికి కూడా ఇది నిదర్శనం.

"పిప్రహ్వా అవశేషాలు 1898లోనే బయటపడినప్పటికీ.. వలస పాలన కాలంలో వాటిని భారత్ నుంచి తరలించారు.

# జూనియర్ అసిస్టెంట్ కోమకుల ముత్తయ్య ఉద్యోగ విరమణ



ములుగు, జులై 31:రెవిన్యూ, ఇరిగేషన్ శాఖలో ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూ 31 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసి ఉద్యోగ విరమణ పొందుతున్న ముత్తయ్య సేవలు అమోఘమని ములుగు డివిజనల్ నీటిపారుదల శాఖ డిప్యూటి చీఫ్ ఇంజనీర్ అప్పలనాయుడు అన్నారు.

గురువారం జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్ లో డివిజనల్ నీటిపారుదల శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న కోమాకుల ముత్తయ్య సన్మానోత్సవ కార్యక్రమాన్ని ములుగు డివిజన్ నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

కోమకుల ముత్తయ్య చాలా సునితమైన మనస్తత్వం కలిగినవాడని తనలో చాలా నైపుణ్యాలు ఉన్నాయని విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించారని ఆయన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

ఈ సందర్భంగా కోమాకుల ముత్తయ్య వారి శ్రీమతి విజయ గార్లను శాలువాలతో పూలబొకెలతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

అదేవిధంగా ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు జోష్ణ, శ్రీధర్ రవీందర్ , టీఎన్జీవో జిల్లా కార్యదర్శి మేడి చైతన్య, తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గుల్ల గట్టు సంజీవ, కోమాకుల ముత్తయ్య సతీమణి విజయ, వారి కుటుంబ సభ్యులు సీతారాములు, రిటైర్డ్ ఉద్యోగులు దుర్గం నూరయ్య, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ రమేష్, రెవెన్యూ శాఖ ఉద్యోగులు సంబంధిత శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ క్రీడా రంగానికి మంచి భవిష్యత్తు

## –నూతన క్రీడా విధానంతో మారనున్న క్రీడారంగ ముఖచిత్రం

## – సీఎం రేవంత్ గారి ఆలోచనల ప్రతిరూపమే నూతన క్రీడా విధానం


## – రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి




హైదరాబాద్, జులై 29 సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు సమగ్రమైన తెలంగాణ క్రీడా విధానం 2025 ను రూపొందించామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఈరోజు వనపర్తి నియోజకవర్గం ఆత్మకూరు కేంద్రంలో స్పోర్ట్స్ కాంప్లెవ్ పోస్టర్ ను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దశాబ్ద కాలం నుండి విస్మరించబడ్డ క్రీడా రంగము సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో వేగవంతంగా పనిచేస్తూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కృషి జరుగు తోందని అన్నారు. తాను క్రీడల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొత్తం మొట్టమొదటి క్యాబినెట్ సమావేశంలోనే క్రీడారంగం ఆమోదింపబడటము ఒక క్రీడాకారుడిగా తనకి ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు. దీర్ఘకాలిక క్రీడల అభివృద్ధి కొరకు ఉద్దేశించబడ్డాయి ఈ నూతన క్రీడా విధానాన్ని పటిష్టంగా పకడ్బందీగా అమలు చేయడానికి దేశవ్యాప్తంగా ఉన్న వివిధ క్రీడారంగా నిష్ణాతులు వివిధ క్రీడా సమాఖ్యల ప్రతినిధులతో కలిసి విస్తృత స్థాయిలో ఈ స్పోర్ట్స్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడా విధానం2025 తెలంగాణ క్రీడా రంగానికి ఒక నూతన వరవడిని సాధించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడా రంగానికి క్రీడాకారులకు మంచి భవిష్యత్తును అందజేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి, మట్టిలో మాణిక్యాల ను గుర్తించి వారిని ప్రపంచ ఛాంపియన్లుగా ఇది ఈ క్రీడా విధానం ఎంతో దోహదం చేస్తుందని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, నూతన క్రీడా విధానంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ బాధ్యతలు మరింత విస్తరించబోతున్నాయని వివిధ శాఖల సమన్వయంతో విస్తృతంగా క్రీడా కార్యక్రమాలను నిర్వహించడానికి, క్రీడాకారుల ను ప్రోత్సహించడానికి బహుముఖంగా తెలంగాణ స్పోర్ట్స్ తాటి సేవలు అందజేయడానికి ఈ విధానం ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి గారి కృషి వల్ల తెలంగాణ క్రీడారంగ ముఖచిత్రవే మారిపోతుందని ఆయన వివరించారు.ఒక ఏడాదికాలంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరఫున ఎన్నో జాతీయ అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలు నిర్వహించామని, రానున్న రోజుల్లో ఈ కృషిని మరింత రెట్టింపు ఉత్సాహంతో కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# "దత్తన్న జీవితం అందరికీ ఆదర్శం"

-దత్తన్నకు స్వర్గీయ మహాకాళి మహేశ్ అవార్డు అందజేత
-సభలో డా. బండా ప్రకాశ్, జి. నిరంజన్, దాసోజు శ్రవణ్, వి. శ్రీనివాస్ గౌడ్, వకుళాభరణం తదితరులు




హైదరాబాద్, జులై 30:హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ విలువలతో కూడిన రాజకీయ నాయకుడు, అజాతశత్రువు అని శాసనమండలి డా. బండా ప్రకాశ్ అన్నారు. ప్రతియేటా హైదరాబాద్ బోనాలు ముగిసాక అందజేసే 'మహాకాళి మహేశ్ గౌడ్ బోనాల ప్రతిష్ఠాత్మక 2025 పురస్కారం'ను ఈ ఏడాది బండారు దత్తాత్రేయకు అందజేశారు. ఈ సందర్భంగా గురువారం నాడు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఈ ఉత్సవం కన్నుల పండుగలా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు అధ్యక్షత వహించారు.సభలో మాట్లాడుతూ బండారు దత్తాత్రేయ గారు? పాతబస్తీలో పుట్టి పెరిగిన తనకు ఈ పురస్కారం ఒక గొప్ప అనుభూతినిచ్చిందని పేర్కొన్నారు. "బోనాలు ఆడపిల్లల స్త్రీమూర్తులకు అర్పించే భక్తి పండుగ. ఇది మన సంస్కృతిలో ఆడపిల్లల గౌరవాన్ని ప్రతిబింబించే ప్రత్యేక పండుగ. మహిళలను గౌరవించడం నా సంప్రదాయం" అని అన్నారు. తన రాజకీయ ప్రయాణంలో ప్రజా సేవను మాత్రమే ధ్యేయంగా పెట్టుకున్నానని, ప్రజల ప్రేమే తనకు పెద్ద బహుమతి అని తెలిపారు. ఎంఎల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ మహాకాళి మహేశ్ సింహవాహిని దేవాలయ అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ మాట్లాడుతూ పాత నగర బోనాలు?దేవాలయాల ప్రశస్తిని, వాటి అభివృద్ధికి కృషి చేసిన మహాకాళి మహేశ్, కె. ప్రకాశ్, వెంకట్‌స్వామి, లింగం మున్నగు వారి సేవలను స్మరించుకున్నారు. మాజీ మంత్రి డా. వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బండారు దత్తాత్రేయ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భాషా? సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, జోగిని నిషా క్రాంతి, దివాగ్న శర్మ, మారుతి యాదవ్, గోపి శెట్టి రాఘవేందర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉత్తమ పాత్రికేయులకు, ఉత్తమ అధికారులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమ సమన్వయకర్తలుగా ట్రస్ట్ చైర్మన్ కె. ప్రవీణ్ కుమార్, అధ్యక్షుడు జి. అర్వింద్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కె. వెంకటేశ్ వ్యవహరించారు. కార్యక్రమంలో బోనాల నృత్య రూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ రూపాల్లో ప్రదర్శించిన కళా ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి

# తిరుమలలో సోషల్ మీడియా రీల్స్ చిత్రీకరణకు పాల్పడితే కేసులు : టీటీడీ హెచ్చరిక

తిరుపతి, జులై 31:పవిత్రమైన తిరుమలలో అసభ్యకర వీడియోలు, వెకిలి చేష్టలతో రీల్స్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ హెచ్చరించింది తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణం, పవిత్రతను కాపాడడంలో సహకరించాలని భక్తులకు విజ్ఞప్తి చేసింది . ఇటీవల కొందరు తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట , మాడ వీధుల్లో వెకిలి చేష్టలు, నృత్యాలు ప్రదర్శిస్తూ వీడియోలు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారని ఆరోపించింది.

పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రంలో ఇలాంటి అభ్యంతరకర ,అసభ్యకర చర్యలను సహించబోమని సంబంధిత అధికారులు గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఈ తరహా చర్యలు ఆధ్యాత్మిక వాతావరణానికి విఘాతం కలిగిస్తున్నాయని వెల్లడించారు. తిరుమలలో కేవలం ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకే పరిమితం కావాలని, శ్రీవారి దర్శనార్థం వచ్చే లక్షలాది మంది భక్తుల మనోభావాల పట్ల గౌరవం చూపడం ప్రతి ఒక్కరి బాధ్యతని గుర్తు చేశారు.

టీటీడీ విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది ఇలాంటి వీడియోలు చిత్రీకరించేవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటారని వెల్లడించారు. తిరుమల పవిత్రతను భంగం కలిగేలా వ్యవహరించే వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుంది.

# పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక

-బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని బీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ దేశం యొక్క ప్రజాస్వామ్య నిర్మాణం హానికరమైన పద్ధతుల ద్వారా క్షీణించకుండా చూసుకున్నందుకు గౌరవనీయ ప్రధాన న్యాయమూర్తికి మేము కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాలను పటిష్టం చేయాలని, ఫిరాయింపులపై ఆటోమేటిక్ రద్దు చేయాలని తన పంచ న్యాయ్‌లో వాదించిన రాహుల్ గాంధీ ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తారని ఆశిస్తున్నాను. మిస్టర్ గాంధీ, మీ స్వంత ఉపదేశాలకు కట్టుబడి ఉండమని నేను మీకు చెబుతున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు. గౌరవనీయులైన స్పీకర్ పదవిని మీరు, మీ పార్టీ భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడానికి ఉపయోగించుకోరని నేను ఆశిస్తున్నాను. ఈ 10 మంది ఎమ్మెల్యేలు అక్రమంగా కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రతిరోజూ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని అంగీకరించడానికి పెద్దగా పరిశోధన అవసరం లేదు అని కేటీఆర్ తెలిపారు.

# శుద్ధి చేసిన గని నీటి వినియోగం

న్యూఢిల్లీ, జులై 31:శుద్ధి చేసిన గని నీటిని సంబంధిత పర్యావరణ, నీటి సంరక్షణ మార్గదర్శకాలకు అనుగుణంగా తాగు, సాగు, పారిశ్రామిక ప్రయోజనాల కోసం ఉపయోగించటాన్ని బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రోత్సహిస్తోంది. దాని ఆధ్వర్యంలో ఉన్న బొగ్గు, లిగ్నైట్‌కు సంబంధించిన ప్రభుత్వ రంగ సంస్థలైన (పీఎస్‌యూ) కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్), ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎల్‌సీఐఎల్), సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) ద్వారా ఈ దిశగా కృషి చేస్తోంది. పర్యావరణ పరిరక్షణ చట్టం- 1986, నీటి (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం- 1974.. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ), సంబంధిత రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డులు (సీపీసీబీ) జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా నీటి నాణ్యత ఉండేలా చూసుకుంటోంది. వివిధ పనుల కోసం శుద్ధి చేసిన గని నీటిని సురక్షితంగా, సమర్థవంతంగా వాడుకునేలా చూసుకునేందుకు బొగ్గు, లిగ్నైట్ ప్రభుత్వ రంగ సంస్థలు కూడా సొంత ప్రామాణిక నిర్వహణ నిబంధనలను రూపొందించాయి.

తాగునీటి అవసరాల కోసం సరఫరా చేస్తోన్న శుద్ధ గని నీరు.. ఆరోగ్య, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉందన్న నిర్ధారణ కోసం ఆయా సంస్థలు వివిధ నాణ్యత నియంత్రణ చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భారత ప్రమాణాల సంస్థ (బీఐఎస్ ఐఎస్ 10500:2012), జాతీయ భూగర్భ జలవనరుల ప్రాధికార సంస్థ (సీజీడబ్ల్యూఏ), ఈ విషయంలో వర్తించే ఇతర ప్రమాణాలు సూచించిన పరిమితుల ప్రకారం గుర్తింపు పొందిన ప్రయోగశాలల ద్వారా శుద్ధి చేసిన గని నీటిని కాలానుగుణంగా పరీక్షిస్తున్నారు. సరఫరాకు ముందు అవక్షేపణ, వడపోత, క్రిమిసంహారణ వంటి సరిపడా శుద్ధి ప్రక్రియలు చేపడుతున్నాయి.

బొగ్గు, లిగ్నైట్ గనులున్న అన్ని రాష్ట్రాలలో గని నీటి నిర్వహణ కార్యక్రమాలను అమలు చేసేందుకు పనులు జరుగుతున్నాయి. మిగులు గని నీటిని గృహ, నీటిపారుదల, పారిశ్రామిక అవసరాల కోసం లాభదాయకంగా ఉపయోగించుకునే ప్రాజెక్టులను బొగ్గు, లిగ్నైట్ పీఎస్‌యూలు చేపట్టాయి.

ఈ సమాచారాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జీ. కిషన్ రెడ్డి ఈరోజు లోక్‌సభకు లిఖితపూర్వక సమాధానంగా తెలిపారు.

# పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 20వ విడత ఆగస్టు 2న విడుదల

న్యూఢిల్లీ, జులై 31:ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకం తదుపరి విడత ఆగస్టు 2న విడుదల కానుంది. కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన ఈ రోజు జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షించారు. వారణాసిలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా పెద్ద సంఖ్యలో రైతులకు ప్రయోజనం కలగనుంది.

దేశవ్యాప్తంగా ఉన్న 731 కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకే), భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్), వ్యవసాయ విశ్వవిద్యాలయాల డైరెక్టర్లు, వైస్ చాన్సలర్లు, అధిపతులు వర్చువల్‌గా ఈ సమావేశానికి హాజరయ్యారు.

జాతీయ, రాష్ట్ర, జిల్లా, గ్రామ స్థాయిల్లో రైతులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని అధికారులను కేంద్ర మంత్రి ఆదేశించారు. దీన్ని దేశవ్యాప్త కార్యక్రమంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

కేవీకేలకు దిశానిర్దేశం చేస్తూ.. ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో రైతులకు మూడు విడతల్లో రూ.6,000 బదిలీ చేస్తున్నామని, నాలుగు నెలలకోసారి ఒక్కో విడతను మంజూరు చేస్తున్నట్లు చౌహాన్ తెలిపారు. ఈ ప్రక్రియలో కేవీకేలు కీలక పాత్ర పోషిస్తాయి. ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలనీ.. రైతుల ఖాతాల్లోకే నేరుగా ధనాన్ని బదిలీ చేసి, ప్రజల్లో అవగాహన కలిగించే ఈ కార్యక్రమాన్ని ఓ పండుగగా, మిషన్‌గా నిర్వహించాలని సూచించారు.

ఈ పథకం ద్వారా లబ్ధి పొందడంతోపాటు వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలపట్ల అవగాహనను పెంపొందించుకోవడానికి ఇదో మంచి అవకాశమన్న కేంద్ర మంత్రి.. ఆగస్టు 2న జరిగే కార్యక్రమంలో క్రియాశీలంగా భాగస్వాములు కావాలని రైతులను కోరారు.

ఈ కార్యక్రమం గురించి సమాచారాన్ని విస్తృతంగా వ్యాప్తి చేయడానికి కృషి సఖీలు, డ్రోన్ దీదీలు, బ్యాంక్ సఖీలు, పశు సఖీలు, బీమా సఖీలు, గ్రామ పంచాయతీ సర్పంచుల వంటి క్షేత్రస్థాయి కార్యకర్తలను ఉపయోగించుకోవాలని అధికారులను శ్రీ చౌహాన్ ఆదేశించారు. ఈ సమయంలోని ఖరీఫ్ పంటల గురించి రైతులతో చర్చించడం ద్వారా.. వారి భాగస్వామ్యాన్ని మరింతగా పెంచవచ్చని ఆయన అన్నారు.

ప్రధానమంత్రి మోదీ మార్గనిర్దేశంలో పూర్తిస్థాయి భాగస్వామ్యం, అంకితభావంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా పెద్ద సంఖ్యలో రైతులకు ప్రయోజనం కలిగేలా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని శ్రీ చౌహాన్ పునరుద్ఘాటించారు.

2019లో ఈ పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి 19 విడతల్లో రూ. 3.69 లక్షల కోట్లను రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. 20వ విడతలో 9.7 కోట్ల మంది రైతులకు రూ.20,500 కోట్లు బదిలీ చేయనున్నారు.

వ్యవసాయ శాఖ కార్యదర్శి శ్రీ దేవేశ్ చతుర్వేది, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఎల్ జాట్, వ్యవసాయ మంత్రిత్వ శాఖకు చెందిన ఇతర సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# వెకిలి చేష్టలు చేయొద్దు..

తిరుపతి, జులై 31:తిరుమల శ్రీవారి ఆలయం పరిసరాల్లో కొందరు వ్యక్తులు డ్యాన్సులు చేసి, అసభ్య చర్యలతో సోషల్ మీడియా రీల్స్ చేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఈ ఘటనలపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తీవ్రంగా స్పందించింది.

భక్తి, ఆరాధన కేంద్రమైన పవిత్ర తిరుమల ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఇలాంటి అనుచిత చర్యలు తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని తితిదే వెల్లడించింది. భక్తుల మనోభావాలను గౌరవించకుండా ఈ వీడియోలను చిత్రీకరించడాన్ని తాము సహించబోమని స్పష్టం చేసింది.

ఇలాంటి ఘటనలపై విజిలెన్స్ సిబ్బంది ఇప్పటికే చర్యలు ప్రారంభించారని, బాధ్యులపై కేసులు నమోదు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తితిదే హెచ్చరించింది. తిరుమలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు మాత్రమే జరగాలని, ఈ పవిత్రతను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి భక్తుడిపై ఉందని తితి స్పష్టం చేసింది.

# న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



కరీంనగర్, జులై 31:న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం ధర్మపురి లోని ఎమ్మెల్యే క్యాంపులో నంది మేడారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు. నూతనంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగిన సందర్భంగా అధ్యక్షుడు గడ్డం లింగారెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు నార అశోక్ రెడ్డి, బొట్ల లక్ష్మీనర్సయ్య, నూనె సత్యనారాయణ , భీమారపు సంపత్ తదితరులు లక్ష్మణ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. నంది మేడారం కోర్టు అభివృద్ధి కోసం కృషి చేయాలనీ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా బార్ అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికికృషి చేస్తా నని హామీ ఇచ్చినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగారెడ్డి గారు తెలిపారు.

# బ్యాంకింగ్ చట్టాల (సవరణ) చట్టం-2025లోని కీలక నిబంధనలు రేపటి నుంచి అమలు

న్యూఢిల్లీ, జులై 31:'బ్యాంకింగ్ చట్టాల (సవరణ) చట్టం-2025'ను గత ఏప్రిల్ 15న నోటిఫై చేశారు. దీనిలో అయిదు చట్టాలు.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం-1934, బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం-1949, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం-1955తో పాటు బ్యాంకింగ్ కంపెనీల (సంస్థల స్వాధీనం-బదలాయింపు) చట్టం-1970, 1980..వీటిని కలిపేస్తూ, మొత్తం 19 సవరణలకు స్థానం కల్పించారు.

బ్యాంకింగ్ రంగంలో పరిపాలన సంబంధిత ప్రమాణాలను మెరుగుపరచాలన్నదే బ్యాంకింగ్ చట్టాల (సవరణ) చట్టం-2025 ఉద్దేశం. ఇన్వెస్టర్లు, డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడడం, ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఆడిట్ ప్రమాణాలను మెరుగుపరచడం, కోఆపరేటివ్ బ్యాంకులలో డైరెక్టర్ల పదవీకాలాన్ని పెంచడం (చైర్‌పర్సన్, పూర్తి కాలపు డైరెక్టర్ మినహా) దీనిలో భాగంగా ఉన్నాయి.

గత జులై 29 నాటి గెజిట్ నోటిఫికేషన్ ఎస్.ఓ. 3494 (ఇ) లో పేర్కొన్న ప్రకారం, బ్యాంకింగ్ చట్టాల (సవరణ) చట్టం-2025 (2025కు చెందిన 16)లోని 3, 4, 5, 15, 16, 17, 18, 19వ సెక్షన్ల నిబంధనలు ఆగస్టు 1 నుంచి అమలులోకి రానున్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

పైన ప్రస్తావించిన నిబంధనలు 'వాస్తవ వడ్డీ' పరిధిని రూ.5లక్షల నుంచి రూ.2 కోట్లకు పెంచుతాయి. దీంతో, 1968 నుంచి మార్పు లేకుండా ఉన్న పరిమితిని సవరించినట్లయింది.

దీనికి అదనంగా, ఈ నిబంధనలు కోఆపరేటివ్ బ్యాంకులలో డైరెక్టర్ల పదవీకాలాన్ని 97వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా తీర్చిదిద్దుతాయి. గరిష్ఠ పదవీకాలాన్ని 8 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాలకు (చైర్ పర్సన్, పూర్తి కాలపు డైరెక్టర్ మినహా) పెంచుతాయి.

క్లెయిమ్ చేయని షేర్లను, వడ్డీని, గడువు తీరిన బాండ్ల సొమ్మును ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ (ఐఈపీఎఫ్)కు బదలాయించడానికి ఇకపై ప్రభుత్వ రంగ సంస్థలకు (పీఎస్‌బీస్) అనుమతిస్తారు. ఈ విధంగా పీఎస్‌బీలు కూడా కంపెనీల చట్టం పరిధిలో కంపెనీలు పాటిస్తున్న పద్ధతులను అనుసరించగలుగుతాయి. ఈ సవరణలు స్టాట్యూటరీ ఆడిటర్లకు పారితోషికాన్ని ఇచ్చే, మంచి సామర్థ్యం కలిగిన ఆడిట్ వృత్తినిపుణులను నియమించుకొనే, ఆడిట్ ప్రమాణాలను మెరుగుపరిచే అధికారాలను పీఎస్‌బీలకు కల్పిస్తాయి.

ఈ నిబంధనలు అమలులోకి వస్తే భారతీయ బ్యాంకింగ్ రంగంలో చట్టపరమైన, నియంత్రణ సంబంధమైన, పరిపాలన స్వరూపాన్ని పటిష్ఠపరిచే దిశగా ఒక కీలక అడుగును వేస్తున్నట్లయింది.

# కొత్త క్రిమినల్ చట్టాలలో బాధితులకు అనుగుణంగా మార్పులు

న్యూఢిల్లీ, జులై 31:భారతీయ న్యాయ సంహిత-2023లో మొదటిసారిగా మహిళలు, పిల్లలపై నేరాలకు సంబంధించిన నిబంధనలకు ప్రాధాన్యత లభించింది. ఇవన్నీ ఒకే అధ్యాయం కింద ఉన్నాయి. మహిళలపై నేరాల విషయంలో మరణశిక్షతో కూడిన కఠినమైన శిక్షలు ఉన్నాయి. 18 సంవత్సరాల లోపు వయసున్న మహిళలపై సామూహిక అత్యాచారానికి శిక్ష.. దోషికి మిగిలి ఉన్న సహజ జీవితంలో మిగిలిన భాగం లేదా మరణం వరకు జీవిత ఖైదు. వివాహం, ఉద్యోగం, పదోన్నతి, గుర్తింపును దాచిపెట్టడం వంటి తప్పుడు హామీలతో లైంగిక సంబంధం పెట్టుకున్న విషయాలను ఇప్పుడు నేరంగా పరిగణిస్తోంది. మానవ అక్రమ రవాణా, అక్రమ రవాణా చేసిన పిల్లలపై లైంగిక దాడుల నేరాలకు జీవిత ఖైదు వరకు కఠినమైన శిక్ష విధించే నిబంధన కూడా ఉంది. పిల్లల అక్రమ రవాణా విషయంలో కనీస శిక్ష జరిమానాతో సహా 10 సంవత్సరాల కంటే తక్కువ కాకుండా జైలు కాగా.. గరిష్ఠంగా జరిమానాతో సహా జీవిత ఖైదు. అక్రమ రవాణా విషయంలో దోపిడీ చేసేందుకు 'భిక్షాటన'ను ఉపయోగించటం అనేది న్యాయ సంహితలోని సెక్షన్ 143 ప్రకారం శిక్షార్హమైనది. నేరం చేసేందుకు పిల్లలను నియమించడం, నేరంలో వారిని నిమగ్నం చేయడం కూడా శిక్షార్హమైన నేరంగా ఉంది. కొత్త క్రిమినల్ చట్టాలలో మహిళలు, పిల్లల రక్షణకు సంబంధించిన ప్రధాన నిబంధనలు అనుబంధం-2లో ఉన్నాయి.

# అసత్య వార్తలు, తప్పుడు సమాచారాన్ని నిజ నిర్ధారణ యూనిట్, పోస్టుల ద్వారా ఎప్పటికప్పుడు తిప్పికొట్టడం ప్రభుత్వ అత్యున్నత బాధ్యత: అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, జులై 31:ముద్రణ మాధ్యమాలు: ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) నిర్దేశించిన 'పాత్రికేయ ప్రవర్తనా నియమావళి'కి వార్తాపత్రికలు కట్టుబడి ఉండాలి. ఈ నిబంధనలు పలు ఇతరత్రా అంశాలతోపాటు అసత్య/అప్రతిష్ఠకు గురిచేసే/తప్పుదారి పట్టించే వార్తల ప్రచురణను నిరోధిస్తాయి. చట్టంలోని సెక్షన్ 14 ప్రకారం.. నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై కౌన్సిల్ విచారణ నిర్వహిస్తుంది. సందర్భాన్ని బట్టి వార్తాపత్రిక, సంపాదకులు, జర్నలిస్టులు మొదలైన వారిని హెచ్చరించవచ్చు, మందలించవచ్చు లేదా ఆక్షేపించవచ్చు.

టెలివిజన్ మాధ్యమాలు: కేబుల్ టెలివిజన్ నెట్‌వర్కుల (నియంత్రణ) చట్టం-1995 ప్రకారం టీవీ ఛానళ్లు కార్యక్రమ నియమావళికి కట్టుబడి ఉండాలి. పలు ఇతర అంశాలతోపాటు.. అశ్లీల, పరువు నష్టం కలిగించే, దురుద్దేశపూర్వక, తప్పుడు, పరోక్ష అన్యాపదేశ ప్రకటనలు, అర్ధ సత్యాలు ఉన్న కంటెంటును ప్రసారం చేయొద్దని ఆ చట్టం నిర్దేశిస్తుంది. కేబుల్ టెలివిజన్ నెట్‌వర్కుల (సవరణ) నియమాలు-2021 ప్రకారం.. నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి టీవీ చానెళ్లపై ఫిర్యాదులను పరిశీలించడానికి మూడంచెల ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం ఉంటుంది. కార్యక్రమ నియమావళిని ఉల్లంఘించినట్టు తేలితే తగిన చర్యలుంటాయి.

డిజిటల్ మాధ్యమాలు: డిజిటల్ మీడియాలో వార్తలు, వర్తమాన వ్యవహారాల ప్రచురణకర్తలకు సంబంధించి.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యంతర మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నియమావళి) నిబంధనలు, 2021 (ఐటీ నియమాలు- 2021) నైతిక నియమావళిని అందిస్తాయి.

కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి తప్పుడు వార్తలను నియంత్రించడం కోసం.. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని పత్రికా సమాచార కార్యాలయం 2019 నవంబరులో ఓ నిజ నిర్ధారణ విభాగాన్ని (ఎఫ్‌సీయూ) ఏర్పాటు చేసింది. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/విభాగాలలోని అధీకృత ఆధారాలతో ఆ వార్తల ప్రామాణికతను ధ్రువీకరించిన అనంతరం.. ఎఫ్‌సీయూ తన సోషల్ మీడియా వేదికల్లో సరైన సమాచారాన్ని అందిస్తుంది.

సమాచార చట్టం-2000లోని సెక్షన్ 69(ఎ) ప్రకారం.. భారత సార్వభౌమాధికారం, సమగ్రత, దేశ రక్షణ, భద్రత, శాంతిభద్రతల దృష్ట్యా వెబ్‌సైట్‌లు, సోషల్ మీడియా ఖాతాలు, పోస్టులను బ్లాక్ చేయడానికి అవసరమైన ఆదేశాలను ప్రభుత్వం జారీ చేస్తుంది.

ఐటీ చట్టం- 2000 ద్వారా.. 2021 ఫిబ్రవరి 25న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యంతర నిర్దేశాలు - డిజిటల్ మీడియా, నైతిక నియమావళి) నిబంధనలు- 2021ని ప్రభుత్వం ప్రకటించింది.

నిబంధనల్లోని విభాగం-ఎఎ డిజిటల్ వార్తల ప్రచురణకర్తలు, ఆన్‌లైన్ ప్రసారం కోసం రూపొందించిన కంటెంట్ (ఓటీటీ వేదికలు) ప్రచురణకర్తల కోసం నైతిక నియమావళిని అందిస్తుంది.

ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం నిషేధించిన ఏ కంటెంటునూ ప్రసారం చేయకుండా ఉండాల్సిన బాధ్యత ఓటీటీ వేదికలపై ఉంది.

నిబంధనల షెడ్యూలులో పేర్కొన్న సాధారణ మార్గదర్శకాల ఆధారంగా.. వయస్సు ప్రాతిపదికన కంటెంటుకు సంబంధించి స్వీయ వర్గీకరణను చేపట్టాల్సిన బాధ్యత ఉంది. నగ్నత్వం, లైంగికత వంటి అంశాల చిత్రణకు సంబంధించిన నిబంధనలు ఇందులో ఉన్నాయి.

పిల్లల విషయంలో.. వయసుకు తగని కంటెంటుపై పరిమితులు విధించేందుకు తగిన జాగ్రత్తలతో కూడిన ఏర్పాట్లను చేయాల్సిన బాధ్యత ఓటీటీ వేదికలపై ఉంది. ఈ దిశగా తగిన నియంత్రణ చర్యలు చేపట్టాలి. అంతేకాకుండా.. ఐటీ చట్టం-2000లోని సెక్షన్ 79(3)(బి) ప్రకారం.. చట్టవిరుద్ధమైన చర్యలు లేదా కంటెంట్ గురించి సంబంధిత ప్రభుత్వాలు ఆ మాధ్యమాలకు ఆదేశాలిచ్చి దాన్ని ప్రసారమవకుండా తొలగిస్తాయి/ నిలిపేస్తాయి.

కంటెంటు ప్రసారం విషయంలో భారత చట్టాలకు, ఐటీ నియమాలు-2021 నిర్దేశించిన నైతిక నియమావళికి కట్టుబడి ఉండేలా చూసుకునేలా ఓటీటీ వేదికలు, స్వీయ నియంత్రణ సంస్థలకు 2025 ఫిబ్రవరి 19న ప్రభుత్వం పలు సలహాలూ సూచనలను అందించింది.

సంబంధిత మంత్రిత్వ శాఖలతో తగిన సంప్రదింపుల అనంతరం.. ఇప్పటివరకు 43 ఓటీటీ వేదికలు బ్లాక్ అయ్యాయి.

# పద్మ పురస్కారాలు-2026 నామినేషన్ల గడువు 2025, ఆగస్టు 15 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ, జులై 31:పద్మ పురస్కారాలకు ప్రతిపాదనలు/సిఫార్సులు సమర్పించడానికి చివరి తేదీని 2025 జులై 31 నుంచి 2025 ఆగస్టు 15 వరకు పొడిగించారు. ఆన్‌లైన్ విధానంలో రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ (https://awards.gov.in ) ద్వారా మాత్రమే పద్మ పురస్కారాలకు నామినేషన్లు/సిఫార్సులు స్వీకరిస్తారు. 2026లో గణతంత్ర దినోత్సవం నాడు ప్రకటించే పద్మ పురస్కారాలు - 2026 ప్రతిపాదనలు/సిఫార్సులు 2025 మార్చి 15 న ప్రారంభమయ్యాయి.

పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ పురస్కారాలు దేశంలోనే అత్యున్నత పౌర పురస్కారాలు. 1954 నుంచి ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవం రోజున ఈ పురస్కారాలను ప్రకటిస్తున్నారు. పురస్కారాలను కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ప్రజా వ్యవహారాలు, ప్రజాసేవ, వ్యాపారం, పరిశ్రమలు సహా అన్ని రంగాలు/విభాగాల్లో 'అత్యుత్తమ సేవలు' అందించిన వారికి గుర్తింపుగా ఈ పురస్కారం ప్రదానం చేస్తారు. జాతి, వృత్తి, స్థాయి, లింగ వివక్ష లేకుండా అందరూ ఈ పురస్కారాన్ని స్వీకరించడానికి అర్హులే. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వైద్యులు, శాస్త్రవేత్తలు మినహా మిగిలిన ప్రభుత్వ ఉద్యోగులు ఈ పద్మ పురస్కారాలకు అనర్హులు.

పద్మ పురస్కారాలను "ప్రజల పద్మ"గా' మార్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. అందుకే స్వీయ నామినేషన్‌తో సహా అర్హులైన వారిని నామినేట్/సిఫార్సు చేయాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది. మహిళలు, బలహీన వర్గాలకు చెందిన వారు, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులు, నిస్వార్థంగా సమాజ సేవ చేస్తున్న వారిలో ప్రతిభావంతులైన వ్యక్తులను గుర్తించడానికి సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

పైన పేర్కొన్న పోర్టల్ లో సూచించిన విధానంలో నామినేషన్/సిఫార్సు చేయాలనుకున్న వ్యక్తి వివరాలతో పాటు వారి విశిష్టతను, సంబంధిత రంగం/విభాగంలో సాధించిన విజయాలు/సేవను స్పష్టంగా కథన రూపంలో ( 800 పదాలకు మించకుండా) వివరించాలి.

# చేపలు వేటకు వెళ్లి కట్టలేరులో ముగ్గురు గల్లంతు

ఎర్రుపాలెం, జూలై 31 : ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల పరిధిలోని బంజర గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు చేపల వేటకు వెళ్లి కట్టలేరు నదిలో గల్లంతైన సంఘటన గురువారం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. బంజర కు చెందిన 9 మంది వ్యక్తులు మీనవోలు బ్రిడ్జి సమీపంలోని కట్టలేరులో చేపలు పట్టేందుకు మధ్యాహ్నం 3 గంటల సమయంలో నదిలోకి దిగగా అందులో ముగ్గురు వ్యక్తులు బాదావత్ రాజు (55), భూక్యా కోటి (46), భూక్యా సాయి (25) కట్టలేరు లోతు తెలియకపోవడంతో పాటుగా ఈత రాక నీటి ప్రవాహంలో గల్లంతయ్యారు.

తోటి వ్యక్తులు వీరిని రక్షించేందుకు ప్రయత్నించి విఫలమవడంతో స్థానిక అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఏసీపీ రెహ్మాన్, తాసీల్దరా? ఎం. ఉషా శారద, సీఐ మధు, ఎస్ఐ రమేశ్ లు ఫైర్ సిబ్బందిని, గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలను చేపట్టారు.

# పీహెచ్‌సీలో అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆకస్మిక తనిఖీ

రాయపోల్, జులై 31 : సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని ఉద్యోగుల హాజరు రిజిస్టరు, ఓపీ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ మొదలైనవి పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, మందుల గురించి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహారాజు, ఇతర సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాయపోల్ మండలం రామారం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి సంబంధిత లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేసుకున్న ప్రతీ ఒక్కరికి డబ్బులు మంజూరు అవుతాయని ఇండ్లు లేని నిరుపేద ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com